
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 335 | విజయవాడ, సోమవారం 7 జులై 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 7 July 2025 | Rs



ఎడ్జ్‌బాస్టన్ కోట బద్దలు కొట్టారు
- 337 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై భారత్ గెలుపు

6



బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాల్లో భాగంగా 'శాంతి, భద్రత, ప్రపంచ పాలనలో సంస్కరణ' అంశంపై ఆదివారం నాటి సెషన్‌లో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

'గ్లోబల్ సౌత్'కు మరింత ప్రాముఖ్యత
- బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోడీ

5



స్వర్ణాల చెరువులో ఘనంగా ప్రారంభమైన రొట్టెల పండగకు పోటెత్తిన ప్రజలు

వెల్లివిరిసిన మతసామరస్యం
- ఘనంగా రొట్టెల పండగ ప్రారంభం
- యాత్రికుల సందడి
- నేడు నారా లోకేష్ రాక

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోన్న, ప్రపంచ వ్యాపితంగా ప్రాముఖ్యత కలిగిన రొట్టెల పండగ నెల్లూరులో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. హిందూ, ముస్లిం, క్రిస్టియన్, ఇతర మత భేదాలు లేవు. కులం పట్టింపులూ లేవు. అంతా ఒక్కటై నెల్లూరు స్వర్ణాల చెరువుల్లో సందడి చేశారు. దేశవిదేశాల నుంచి భారీగా తరలివచ్చిన యాత్రికులతో బారా షాహీద్ దర్గా కిక్కిరిసిపోయింది. చదువు, ఉద్యోగం, ఆరోగ్యం, గృహం, విదేశీయానం... ఇలా అనేక రకాల రొట్టెలను స్వర్ణాల చెరువులో వదిలారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతోపాటు దుబాయ్, అఫ్ఘనిస్తాన్ తదితర ప్రాంతాల నుంచీ పెద్ద ఎత్తున యాత్రికులు మతాలకు అతీతంగా తరలివచ్చారు. కులం, మతం, ప్రాంతం తేడాలు లేవంటూ, తామంతా ఒక్కటేనంటూ రొట్టెల పండగను ఘనంగా జరుపుకున్నారు. ఏటా మొహర్రం సమయంలో ఈ పండగ ప్రారంభం అవుతుంది. ఐదు రోజులపాటు జరుగుతుంది. ఈ పండగను 2016లో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండగగా గుర్తించింది. రొట్టెల పండగకు లక్షలాది మంది రానుండడంతో జిల్లా అధికార యంత్రాంగం పక్కాగా ఏర్పాట్లు చేసింది. హిందు, ముస్లిం బాయ్... బాయ్... అనేలా ఈ పండగ సాగడం ప్రత్యేకం. ముస్లిం పండగని చెప్పినా అదే స్థాయిలో ఇతర మతాల యాత్రికులూ ఇక్కడకు రావడం ప్రత్యేకంగా చెప్పవచ్చు.

బారా షాహీద్ దర్గాకు సుమారు 400 ఏళ్ల చరిత్ర ఉందని రికార్డులు చెబుతున్నాయి. ఈ ప్రాంతంలో అప్పటి రాజుల మధ్య యుద్ధం జరిగిన సమయంలో యుద్ధవీరులు ఇక్కడ సమీపంలోని కొడవలూరు వద్దకు వచ్చారు. అక్కడ జరిగిన యుద్ధంలో 12 మంది యుద్ధవీరులు మిగతా 2లో

అదానీకి స్పోర్ట్స్ సిటీ!
- అమరావతిలో 2,500 ఎకరాల అప్పగింత
- సర్కారు ముమ్మర కసరత్తు



గుజరాత్‌లోని సబర్మతి నదిపై అదాని స్పోర్ట్స్ పార్క్ (ఫైల్)

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల సంపదను అదానీ కంపెనీకి దోచిపెట్టడమే ప్రభుత్వాల పనిగా వుంది. పదేళ్ల నుంచి రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఈ తంతు నడుస్తూనే ఉంది. వైసిపి ప్రభుత్వం పోర్టులు, పవర్ ప్రాజెక్టుల పేరుతో వివిధ చోట్ల వేల ఎకరాలు దోచిపెట్టింది. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం కూడా అందుకు పోటీ పడుతోంది. తాజాగా రాజధాని అమరావతిలో వేల ఎకరాలు అప్పగించేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఎ)తో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తున్నట్లు సమాచారం. రాజధానిలో 2,500 ఎకరాలతో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) ఛైర్మన్‌గా ఉన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కుమారుడు జై షాను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విశాఖపట్నంలో ఒకసారి, దుబాయ్‌లో మరోసారి కలిశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), రాజ్యసభ సభ్యులు సానా సతీష్ కూడా వీరి భేటీలో ఉన్నారు. ఈ సమావేశంలోనే రాజధానిలో స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టు గురించి చర్చకు వచ్చినట్లు సమాచారం. జై షాను లోకేష్ కలిసిన తరువాతే రాష్ట్ర ప్రభుత్వం రాజధానిలో స్పోర్ట్స్‌సిటీ ప్రాజెక్టును ప్రకటించింది. ఇందుకు అనుగుణంగానే ఈ ప్రాజెక్టు ఏర్పాటు కోసం రెండు చోట్ల భూములను ప్రభుత్వం పరిశీలించింది. తొలుత కృష్ణానదిలో ఉన్న చిన్నలంక, పెద్దలంక దీవులను పరిశీలించగా, ఇవి వరదకు మునిగిపోయే అవకాశం ఉండటంతో వద్దనుకున్నారు. ఆ తరువాత కృష్ణానదికి ఆనుకుని ఎన్‌టిఆర్ జిల్లాలోని ఇబ్రహీపట్నంలో దీనిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. ఇబ్రహీపట్నం మండల పరిధిలో ఉన్న త్రిలోచనాపురం, మూలపాడు, కొటికలపూడి, జమీమాచవరం గ్రామాల్లో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. అవసరమైన భూములను భూసమీకరణ విధానంలో తీసుకునేందుకు అంతా సిద్ధం చేశారు.

గుజరాత్‌లో సబర్మతి నదిపై స్పోర్ట్స్ కాంప్లెక్స్‌తో పాటు పలుచోట్ల క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, టెన్నిస్, స్కేటింగ్, స్విమ్మింగ్ వంటి ఆటల్లో ఇప్పటికే బిజినెస్ చేస్తోంది. అమరావతిలో కూడా ఇలానే ఏర్పాటు చేసి క్రీడలతో వ్యాపారం చేయాలని ఆ కంపెనీ ఆలోచన చేస్తోంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సంపూర్ణ మద్దతు ఇస్తోంది. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టును బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బిసిసిఐ) కూడా యధాశక్తి తోడ్పడుతోందని సమాచారం. క్రీడా యూనివర్సిటీ, క్రికెట్ స్టేడియంతోపాటు పలు మైదానాల నిర్మాణాలను పిపిపి విధానంలో అదానీకి అప్పగిస్తారనే చర్చ నడుస్తోంది. బ్యాడ్మింటన్ పుల్లెల గోపిచంద్, క్రికెటర్ ఎంఎస్‌కె ప్రసాద్‌కు అకాడమీల పేరుతో చెరొక 12 ఎకరాలు కేటాయిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యాన శనివారం జరిగిన సిఆర్‌డిఎ సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇంత పెద్ద మొత్తంలో అదానీకి భూములు కేటాయిస్తే విమర్శలు వస్తాయని, అందరితో పాటు కేటాయిస్తున్నామని సమర్థించుకోవచ్చనే ఆలోచన కూడా వుందని అనుకుంటున్నారు.

ఆ పత్రాలు అక్కర్లేదు
- బీహార్‌లో నిబంధనలపై వెనక్కి తగ్గిన ఇసి

పాట్నా : బీహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)పై కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) వెనక్కి తగ్గింది. ఎస్‌ఐఆర్‌లో పేర్కొన్న విధంగా తప్పనిసరి పత్రాలను సమర్పించకపోయినా.. ఓటర్ల జాబితాలో పేరును ధ్రువీకరించుకోవచ్చునని తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని స్థానిక పత్రికల్లోనూ మొదటి పేజీలో ఆదివారం భారీ ప్రకటనలు ప్రచురించింది. 'ఓటర్లు అవసరమైన పత్రాలను అందిస్తే.. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఇఆర్‌ఓ) దరఖాస్తును ప్రాసెస్ చేయడం సులభతరం అవుతుంది. అవసరమైన పత్రాలను అందించలేకపోతే ఇఆర్‌ఓ నిర్వహించే స్థానిక దర్యాప్తు ద్వారా లేదా.. ఇతర డాక్యుమెంట్లు ఆధారంగా ఓటర్ల జాబితాలో పేర్లపై నిర్ణయం తీసుకుంటాం' అని తెలిపింది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రత్యేక సవరణ డ్రైవ్ చేపట్టడంపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆర్‌జెడి, టిఎంసి వంటి పార్టీలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ నేపథ్యంలో ఇసి ప్రకటన వెలువడటం గమనార్హం. గతంలో ఎస్‌ఐఆర్ కోసం 11 పత్రాలు తప్పనిసరి అని ఇసి ఆదేశాలు జారీ చేసింది. ఇందులో జనన ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టులు, విద్యా ధ్రువీకరణ పత్రాలు, శాశ్వత నివాసం, అటవీ హక్కులు, కుల ధ్రువీకరణ పత్రాలు, రాష్ట్ర, స్థానిక అధికారులు తయారుచేసిన కుటుంబ రిజిస్టర్, ప్రభుత్వం జారీ చేసిన భూమి లేదా ఇంటి కేటాయింపు ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ ఉద్యోగులు లేదా పెన్షనర్లకు జారీచేసిన పత్రాలు, 1967కి ముందు వివిధ ప్రభుత్వ సంస్థలు జారీ చేసిన పత్రాలు ఉన్నాయి. వీటిలో ఆధార్, పాన్, గ్రామీణ ఉపాధి జాబ్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్‌లు లేవు.. పైగా వీటిని ఆమోదించబోమని ఇసి స్పష్టం చేసింది. శనివారం సాయంత్రానికి కేవలం 1,12,01,674 మంది ఓటర్లు మాత్రమే ఫారంలు సమర్పించారు. ఈ సంఖ్య బీహార్ మొత్తం ఓటర్లలో 14.18 శాతం మాత్రమే.

గాజా కోసం మౌనం
- రాత్రి 9 నుంచి 9.30 వరకు ఫోన్ల స్విచ్ ఆఫ్ : సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి

ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులతో నిత్యం రక్తమోడుతున్న పాలస్తీనియన్లకు సంఘీభావంగా ప్రపంచవ్యాప్త నిరసనోద్యమానికి విశేష మద్దతు లభిస్తోంది. 'గాజా కోసం మౌనం' (సైలెన్స్ ఫర్ గాజా) పేరిట నిర్వహిస్తున్న అంతర్జాతీయ డిజిటల్ నిరసనలో భాగంగా రాత్రి 9 గంటల నుంచి 9.30 గంటల వరకూ సిపిఎం శాఖలు, శ్రేణులు, మద్దతుదారులు సెల్ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. నేటి (సోమవారం) నుంచి వారం రోజులపాటు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయిల్‌తో కలిసి మారణకాండలో భాగస్వామ్యమైన కార్పొరేట్ సంస్థల నిజస్వరూపం తెలియజెప్పడం నిర్ణీత సమయంలో నిరసన కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు.

సిబ్బంది నియామకాల్లో ఒబిసిలకూ రిజర్వేషన్లు
- సుప్రీం నిర్ణయంపై సిపిఎం హర్షం

5

'శ్రీశైలం' కొత్త గేట్లు ఏర్పాటు చేయకపోతే

తుంగభద్రకు పట్టిన గతే...
ప్రాజెక్టు పరిశీలించిన అనంతరం నిపుణుడు కన్నయ్యనాయుడు

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం ఆనకట్టకు కొత్త గేట్లు ఏర్పాటు చేయకపోతే తుంగభద్ర పరిస్థితే ఎదురయ్యే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రభుత్వ జలవనరుల శాఖ మెకానికల్ విభాగం నిపుణుడు, సలహాదారుడు, గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు తెలిపారు. శ్రీశైలం గేట్ల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. మరో ఐదేళ్లకైనా రేడియల్ క్లస్టర్ గేట్లు కొత్తవి తప్పకుండా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆదివారం ఆయన శ్రీశైలం ఆనకట్టను, గేట్లను పరిశీలించారు. ముందుగా జలాశయానికి నీటిప్రవాహం, వార్షిక మరమ్మతుల పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో కన్నయ్యనాయుడు మాట్లాడుతూ ఆనకట్టపై ఉన్న పదో గేటు ద్వారా వచ్చే లీకేజీ పది శాతం కంటే తక్కువగా ఉన్నందున గేటుకు ఎలాంటి ఇబ్బందీ లేదని తెలిపారు. రేడియల్ క్రస్ట్ గేట్లను క్రమం తప్పకుండా వార్షిక మరమ్మతులతోపాటు పెయింటింగ్ చేయాలని అధికారులకు సూచించారు. జలాశయానికి వార్షిక మరమ్మతుల్లో భాగంగా గత రెండు, మూడు నెలలుగా మరమ్మతులు చేసినప్పటికీ ఎక్కువగా నీరు లీకేజీ అవుతుండడంతో అధికారులు రబ్బర్ సీల్ వేశారని వివరించారు. మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ.1.30 కోట్ల నిధులను కేటాయించిందని, గేట్ల నిర్వహణకు మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. ఆనకట్ట దిగువ భాగాన ఉన్న ప్లంజ్‌పూల్ సమస్యపైనా, ఆనకట్ట భద్రతపైనా పలు అధ్యయన బృందాలు పరిశీలించాయని తెలిపారు. ఆనకట్టకు 60 మీటర్ల దూరంలో ప్లంజ్‌పూల్ ఉండడం వల్ల ఆనకట్టకు ఎలాంటి ప్రమాదమూ ఉండదని వివరించారు. పదవ గేటు లీకేజీని జీరో స్థాయికి తీసుకురావడానికి అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. 2009లో భారీ వరదల వల్ల ఒక గేటుపై నుండి ఎఫ్ఆర్ఎల్ మించి తొమ్మిది అడుగుల మేర 1.30 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలైందని చెప్పారు. 2010 నుండి గేట్లకు పెయింటింగ్ పనులు సరిగా చేయకపోవడం వల్ల కొంత తుప్పు పట్టాయని తెలిపారు. ఆనకట్ట గేట్లు ఏర్పాటు చేసి 40 సంవత్సరాలు దాటిందని, పెయింటింగ్, రబ్బర్ సీల్ అన్ని సరిగా చేసుకుంటే మరో ఐదేళ్ల వరకు పరవాలేదని చెప్పారు. తుంగభద్ర మాదిరిగా 70 సంవత్సరాల వరకు ఉండకూడదని అధికారులకు సూచించారు. ప్లంజ్‌పూల్‌లో ఏర్పడిన గొయ్యి వల్ల డ్యాముకు ఎలాంటి ఇబ్బందీ లేదన్నారు. ఇక్కడి డ్రెయినేజీలో నీళ్లు కూడా లేవని, మిగిలిన డ్యాములలో డ్రెయినేజీ నీళ్లు నిలువ ఉంటున్నాయని వివరించారు. ఎక్కువ వరద నీటి ప్రభావం వల్ల కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లోని రక్షణ గోడలకు బీటలు పడితే విద్యుత్తు కేంద్రాలకు కొంతమేరకు ముప్పు ఉంటుందని తెలిపారు. ఆయన వెంట డ్యామ్ ఎస్ఇ-1 శ్రీరామచంద్రమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వేణుగోపాల్‌రెడ్డి, డిఇ మల్లికార్జున, ఎఇ సుదర్శన్‌రెడ్డి ఉన్నారు. కాగా, గతేడాది వరదలకు తుంగభద్ర గేటు కొట్టుకుపోయింది. దీనిస్థానంలో తాత్కాలిక గేటును ఏర్పాటు చేశారు.



శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలిస్తున్న కన్నయ్యనాయుడు



కరేడు సభలో మాట్లాడుతున్న ఐలు జాతీయ అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్

బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా
న్యాయ పోరాటం
- కరేడు ప్రజలకు అండగా ఉంటాం
- ఐలు జాతీయ అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్
- బాధిత గ్రామాల్లో నిజనిర్ధారణ బృందం పర్యటన

ప్రజాశక్తి- ఉలవపాడు (నెల్లూరు జిల్లా)

కరేడులో రాష్ట్ర ప్రభుత్వం చేస్తోన్న బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నామని, మీకు అండగా ఉండడం కోసం మీ గ్రామాల పర్యటనకు వచ్చామని ఐలు జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. ఇండోసోల్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మీరు చేస్తోన్న ప్రజాపోరాటం మొత్తం సమాజం చూస్తోందని తెలిపారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా కరేడులో జరుగుతున్న పోరాటానికి మద్దతుగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు), పౌర హక్కుల సంఘం, సుమారు 20 మంది హైకోర్టు అడ్వకేట్లు, విజయవాడ, నెల్లూరు, ఒంగోలు లాయర్లతో కూడిన నిజనిర్ధారణ బృందం ఆదివారం బాధిత గ్రామాల్లో పర్యటించింది. గ్రామస్తులతో మాట్లాడి మిగతా 5లో

గిరిపుత్ర

నాడు, నేడు.. కరేడు...

ఫాదర్ ఆఫ్ పొలిటికల్ సైన్స్‌గా పేరొందిన అరిస్టాటిల్ రాజకీయాలను ఒక ఆచరణాత్మక శాస్త్రంగా చూశాడు. ఒక ఉత్తమమైన రాజకీయ క్రమాన్ని సాధించడానికి ఉద్దేశించబడినదిగా భావించాడు. అది సమాజ శ్రేయస్సును, ఆనందాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఉండాలని కోరుకున్నాడు. మరి నేడున్న పరిస్థితులేమిటి? ఈనాటి రాజకీయ పార్టీలు, వాటి విధానాలు ఎలా ఉన్నాయి? అరిస్టాటిల్ ఆశించినట్టు సమాజ శ్రేయస్సు, ఆనందం కోసం పాటుబడడమా లేక సంపన్నుల ప్రయోజనాలు కాపాడడమా? రాష్ట్రంలో జరుగుతున్న కొన్ని పరిణామాలు, మనందరి జీవితానుభవాలూ పరిశీలిద్దాం. స్మార్ట్ మీటర్లు, సెకి- అదానీ ఒప్పందం కేసు, గోదావరి - బనకచర్ల, తాజాగా కరేడు వివాదం... ఇలా ఏది చూసినా పరస్పరం కత్తులు దూసుకునేలా మాట్లాడే రాజకీయ పార్టీలు విధానాల విషయంలో ఒకటిగానే ఉన్నాయని బోధపడుతోంది. వారూ వీరూ శత్రువుల్లా కనిపిస్తూనే బడా కార్పొరేట్లకు మిత్రులుగా భారీ లబ్ధి చేకూరుస్తున్నారని విదితమవుతుంది.

అదానీ- సెకి : జగన్ - మోడీ - చంద్రబాబు

కేంద్ర ప్రభుత్వానికి 'అక్షరమాల అంటే అదానీ, అంబానీ' అని అందరూ అంటుంటారు. అటువంటి అదానీ కంపెనీ ఉత్పత్తి చేసిన సోలార్ విద్యుత్‌ను సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి) ద్వారా రాష్ట్ర డిస్కాముల చేత కొనిపించడానికి రూ.1,750 కోట్ల ముడుపులు ముట్టజెప్పారని అమెరికా కోర్టులో కేసు నమోదయిన విషయం అందరికీ తెలుసు. ఆ ఒప్పందం మూలంగా రాష్ట్రానికి పాతికేళ్లపాటు లక్ష కోట్లు నష్టం వాటిల్లుతుంది. మాజీ ముఖ్యమంత్రిపై ఘోరమైన ఆరోపణలు వచ్చాయి కనుక ఇప్పటి ప్రభుత్వం తీవ్ర చర్యలు తీసుకుంటుందని జనం ఆశించారు. మొదట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ విధంగానే మాట్లాడారు. 'అమెరికా కోర్టులో వేసిన చార్జిషీట్ మా దగ్గర ఉంది, దానిని అధ్యయనం చేసి స్పందిస్తాం. మరింత సమాచారం సేకరిస్తాం. మరొకరు ఇలాంటి తప్పులు చేయకుండా చూస్తాం.' అని 2024 నవంబర్ 22న శాసనసభకు చెప్పారు. నెల కూడా తిరగకముందే డిసెంబర్ 4న మీడియాతో మాట్లాడుతూ సెకితో విద్యుత్ పంపిణీ సంస్థలు చేసుకున్న ఒప్పందంపై ఆలోచిస్తున్నామని అన్నారు. ఒకసారి కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేయాలంటే జరిమానా కట్టాల్సి ఉందని' చెప్పుకొచ్చారు. ఇలా తప్పించుకున్న చంద్రబాబు కన్నంలో దొంగల్లా దొరికిన మాజీ సిఎం జగన్‌ను, అంతర్జాతీయ గజదొంగలాంటి అదానీ కంపెనీని వదిలేశారు. రాష్ట్ర విద్యుత్ వినియోగదార్లనుండి లక్షల కోట్లు కొల్లగొడుతున్న అదానీ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం, అప్పటి, ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై లబ్ధి చేకూర్చాయి. ఇదీ అసలు మర్మం.

పగలగొట్టమన్న స్మార్ట్ మీటర్లే ఇప్పుడు ముద్దు

ప్రస్తుత విద్యా శాఖామాత్యులు నారా లోకేష్ తన యువగళం పర్యటన సందర్భంగా రైతులనుద్దేశించి.. 'మీ పంప్‌సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని పగలగొట్టండి' అని పిలుపునిచ్చారు. అది విన్న జనం జగన్ ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ స్మార్ట్ మీటర్లు కొత్త ప్రభుత్వంలో ఉండవని ఆనందించారు. కానీ, అప్పుడు వాణిజ్య కనెక్షన్లకే పరిమితమైన స్మార్ట్ మీటర్లు టిడిపి కూటమి సర్కారు వచ్చాక ఇళ్లకు సైతం బిగిస్తున్నారు. గంటకో రేటుగా చార్జీ వసూలు చేసే 'టైమ్ ఆఫ్ ద డే' టారిఫ్ విధిస్తున్నారు. గత ప్రభుత్వం, ఇప్పటి సర్కారు రెండూ బిగిస్తున్నది అదానీ కంపెనీకి చెందిన స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లే! వారి టెండర్లే ఒకే అవుతాయి. కాబట్టి అధికారంలో ఏ పార్టీ వున్నా జరిగేది అదానీ కంపెనీ బేరమే! ఇదీ లోగుట్టు!

గేమ్ ఛేంజర్ బనకచర్ల?

రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో భారీ వ్యయం, ఆయకట్టుతో కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. (ఇప్పుడు కమిషన్లు, విచారణలతో ఒక వివాదాలమయమైందనుకోండి) దాన్ని చూసిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మనకూ ఒక కాళేశ్వరం లాంటిది ఉండాలి కదా అని గోదావరి- బనకచర్ల ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. కేంద్రం వద్ద ప్రతిపాదనలు కూడా చేశారు. తరువాత అది వెనక్కుపోగా కొత్తగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం దాన్ని సొరుగులోంచి తీసి సొబగులద్దింది. నామమాత్రపు నీటి తీరువా చెల్లించి సాగునీటిని వాడుకుంటున్న రైతులు ఈ ప్రాజెక్టు వస్తే 'రేటు' చెల్లించే విధానం తెస్తామని సిఎం చంద్రబాబు చెబుతున్నారు. నీటిని వాణిజ్య సరుకుగా మార్చే ఈ ప్రతిపాదన ఆ విధంగా గేమ్ ఛేంజరే! రూ.80 వేల కోట్లకుపైగా ఖర్చయ్యే ఈ ప్రాజెక్టు మూలంగా నష్టపోయేది రైతులు, ప్రజలూ కాగా లబ్ధి పొందేది మాత్రం భారీ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు నిర్మించి, నిర్వహించే కంపెనీలే! అందుకు 'మెఘా' కంపెనీనే గత సర్కారు, నేటి ప్రభుత్వమూ ఎంపిక చేశాయన్నది జనవాక్యం. కేంద్రంలోనూ కాగల కార్యాలను వారే చక్కబెడుతున్నారని అంతా చెప్పుకొంటున్నారు.

డొల్ల కంపెనీల కరేడు!

నెల్లూరు జిల్లా కరేడులో ఇండోసోల్ కంపెనీకి ఎనిమిది వేల ఎకరాల భూపందేరానికి నిరసనగా అక్కడి ప్రజలు జాతీయ రహదారిని దిగ్బంధనం చేయడంతో పెను సంచలనంగా మారింది. ఇప్పుడు ముందుకొచ్చినా ఇది కూడా పాత అంశమే! ఆ భూముల్లో ప్రాజెక్టు పెడతామంటున్న ఇండోసోల్, షిరిడి సాయి కంపెనీలు రాష్ట్రానికి కొత్త కాదు. 2023 అక్టోబర్ 26న టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. "అధిక ధరకు డిస్కములు ట్రాన్స్‌ఫార్మర్లు (షిరిడి సాయి ఎలక్ట్రికల్ నుంచి) కొనుగోలు చేయడంపై సిబిఐ విచారణ జరపాలని" డిమాండ్ చేశారు. ఇది భారీస్కాం అని, డిస్కములు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆరోపించారు.

నవంబర్ 2న బిజెపి అధికార ప్రతినిధి లంకా దినకర్ 'ఇండోసోల్ సోలార్, షిరిడిసాయి ఎలక్ట్రికల్స్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల బినామీ కంపెనీల'ని ఆరోపించారు. నవంబర్ 15న జనసేన నేత, ప్రస్తుత మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ.. అప్పటి ముఖ్యమంత్రి సన్నిహితులు 22 నెలల క్రితం ముందుకు తెచ్చిన డొల్ల కంపెనీ అని ఆరోపించారు. కాబట్టి వైసిపి నాయకుల బినామీలకు టిడిపి కూటమి ప్రభుత్వం ఎనిమిది వేల ఎకరాల విలువైన భూములు కట్టబెడుతోందా? ఇది నిజమా? కాదు.. టిడిపికి కూడా అని ఎలక్టొరల్ బాండ్లు సాక్ష్యం చెబుతాయి. షిరిడీ సాయి కంపెనీ టిడిపికి 2024 జనవరిలో రూ.40 కోట్ల విలువ చేసే ఎలక్టొరల్ బాండ్లు చెల్లించింది. అసలు కథ ఇదీ! అందుకే ఆ ఊళ్లలో జనం రోడ్డెక్కినా అటు అధికార కూటమి లేదా ఇటు ప్రధాన ప్రతిపక్షం కిమ్మనడం లేదు.

- అదానీ కంపెనీల దోపిడీని విడమర్చినది, దానిపై పోరాడుతున్నదీ ఎవరు?
- స్మార్ట్ మీటర్ల గుట్టు విప్పిందెవరు? వాటికి వ్యతిరేకంగా జనాన్ని కదిలిస్తున్నదెవరు?
- కరేడులో జనం ఘోష పట్టించుకున్నదెవరు? వారికి అండగా నిలుస్తున్నదెవరు?
- ఈ ప్రశ్నలన్నిటికీ ఒకటే సమాధానం... అది సిపిఎం, వామపక్షాలేనని!
- వినాశకర నయా ఉదారవాద ఆర్థిక విధానాల్ని కాంగ్రెస్ తీసుకురాగా, బిజెపి వాటినే మరింత వేగంగా అమలు చేస్తోంది.
- రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని, విభజన హామీలు నెరవేర్చని బిజెపి కేంద్ర ప్రభుత్వానికి వైసిపి, టిడిపి, జనసేనలు పోటాపోటీగా మద్దతునిస్తూనే ఉన్నాయి.
- పాలకవర్గ పార్టీల నైజాన్ని జనం గుర్తెరిగి వాటిని తిప్పిగొట్టేందుకు భుజం భుజం కలిపి పోరాడాలి!

ఒకట్రెండు రోజుల్లో సిఎంఒలో బదిలీలు !

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి పాలన ఏడాది పూర్తయిన నేపథ్యంలో భారీగా ఐఎఎస్, ఐపిఎస్, హెచ్ఒడిల్లోని ఉన్నతాధికారులను బదిలీ చేసేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు తెలిసింది. వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా సిఎంఒలో కూడా ఒకట్రెండు మార్పులు చేసే అవకాశం లేకపోలేదు. 10 జిల్లాల కలెక్టర్లు, ఎస్పిలు ఈ జాబితాలో ఉన్నట్లు తెలిసింది. వీరితో పాటు మరికొందరు ఐఎఎస్‌ల బదిలీ కూడా ఉండొచ్చని తెలుస్తోంది. శాంతిభద్రతల విషయంలోనూ కఠిన చర్యలు చేపట్టే దిశగా ఇప్పటికే పోలీస్‌శాఖను ప్రభుత్వం ఆదేశించింది. నేర నియంత్రణతోపాటు శాంతి భద్రతలు నూటికి నూరు శాతం ఉంటేనే పెట్టుబడిదారులు రాష్ట్రానికి వస్తారని ప్రభుత్వం భావిస్తోంది. వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల పర్యటనల్లో శాంతి భద్రతల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించిన పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకునే దిశగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసే ఉద్యోగులు రొటీన్ విధులకు భిన్నంగా ఆధునిక సాంకేతికతను వినియోగించుకునేందుకు వీలుగా సాంకేతిక పరిజ్ఞానంలో పట్టున్న అధికారులను కీలక విభాగాల్లోకి బదిలీ చేసే అవకాశం ఉంది. ఇంటెలిజెన్స్, రెవెన్యూ ఉద్యోగులపై బదిలీతోపాటు శాఖాపరమైన వేటు వేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం.

మాజీ సిజెఐ చంద్రచూడ్‌తో బంగ్లా ఖాళీ చేయించండి

- కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు లేఖ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్‌ను వెంటనే ఢిల్లీలోని అధికారిక నివాసం నుంచి ఖాళీ చేయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు పాలనా విభాగం కోరింది. 2024 నవంబరు 10న సిజెఐగా పదవీ విరమణ పొందిన జస్టిస్ చంద్రచూడ్, గత 8 నెలలుగా టైప్-8 అధికారిక బంగ్లాలోనే ఉంటున్నారని తెలుపుతూ జులై 1న కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శికి లేఖ రాసింది. రిటైర్ అయ్యాక టైప్-7 ప్రభుత్వ బంగ్లాలో ఆరు నెలల పాటు అద్దె చెల్లించకుండానే ఉండొచ్చని, ఆ గ్రేస్ పీరియడ్ ఇప్పటికే గడిచిపోయిందని పేర్కొంది. ప్రస్తుతం సిజెఐగా ఉన్న వారికి టైప్-8 అధికారిక బంగ్లాను కేటాయించాల్సి ఉంది. టైప్-8 అధికారిక బంగ్లాలో నివసించేందుకు జస్టిస్ చంద్రచూడ్‌కు ఇచ్చిన గడువు ఈ ఏడాది మే 31తోనే ముగిసింది. అధికారిక క్వార్టర్స్‌లో ఉండేందుకు మంజూరు చేసే ఆరు నెలల గ్రేస్ పీరియడ్ ఈ ఏడాది మే 10తోనే గడిచిపోయిందని సుప్రీంకోర్టు పాలనా విభాగం గుర్తుచేసింది.

అందరినీ అలరిస్తున్న బాలోత్సవాలు

- భవిష్యత్తులో ఉపాధ్యాయులకూ సాంస్కృతిక పోటీలు
- పల్నాడు జిల్లా బాలోత్సవం నిర్వాహకులు, న్యాయ నిర్ణేతల అభినందన సభలో పి.మధు



అభినందన సభలో మాట్లాడుతున్న పి.మధు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరి మదిని బాలోత్సవాలు దోచేస్తున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న బాలోత్సవాల్లో పల్నాడు బాలోత్సవానికి ప్రత్యేక స్థానం ఉందని రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు అన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో బాలోత్సవ నిర్వాహకులు, న్యాయ నిర్ణేతల అభినందన సభ ఆదివారం జరిగింది. పల్నాడు బాలోత్సవం కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా మధు హాజరయ్యారు. తొలుత పల్నాడు బాలోత్సవం పిల్లలు పండుగ సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగ-2లో చిన్నారులు పోటాపోటీగా ప్రతిభను చాటారన్నారు. 15 వేల మందికిపైగా చిన్నారులు వారి తల్లిదండ్రులతో పెద్ద పండుగను తలపించేలా నిర్వహించారని అభినందించారు. బాలోత్సవాల నిర్వహణపై ఇంకా అధ్యయనం చేసి మరింత మెరుగ్గా నిర్వహించాలని, కవులు, కళాకారులు, రచయితలు, శాస్త్రవేత్తలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయ బాలోత్సవ నిర్వహణకూ సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. టిడిపి కూటమి ప్రభుత్వం 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని చెబుతున్నా ఎంతవరకు చేస్తారో గ్యారెంటీ లేదని, దీనిపై ప్రభుత్వం కాలయాపన చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా పల్నాడు బాలోత్సవం నూతన అధ్యక్షులుగా ఈశ్వర్ కళాశాలల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్‌ను ఎన్నుకున్నారు. బాలోత్సవం నిర్వాహకులు, న్యాయ నిర్ణేతలను సత్కరించారు. ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయిలో సాంస్కృతిక పోటీలు నరసరావుపేటలో నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు.

సెప్టెంబరు వరకు హెచ్‌డి బర్లీ పొగాకు కొనుగోలు

ఎపి మార్క్‌ఫెడ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బర్లీ పొగాకు రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఎపి మార్క్‌ఫెడ్ పొగాకు కొనుగోలును గత నెల 19న ప్రారంభించిందని, సెప్టెంబరు వరకు పొగాకు కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని ఎపి మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ (ఇన్‌ఛార్జి) ఢిల్లీరావు పేర్కొన్నారు. సిఎం యాప్, ఎపి ఎయిమ్స్ వంటి డిజిటల్ ప్లాట్ ఫారమ్‌ల ద్వారా పారదర్శకంగా, రైతులకు అనుకూలంగా కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోంద న్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బాపట్ల జిల్లాలో 5, ఇంకొల్లు, పంగులూరు, పర్చూరు, బికె పాలెం (ప్రైవేట్ గిడ్డంగి) చీరాల, గుంటూరు జిల్లాలో గుంటూరు, పెదకాకాని, పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట, ఎడ్లపాడు, ప్రకాశం జిల్లాలో గండ్లపల్లి కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు రూ.17.20 కోట్లు విలువైన, 2088 మెట్రిక్ టన్నులు, 2,245 బేళ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు సిఎం యాప్‌లో గ్రామ వ్యవసాయ సహాయకుల సహాయంతో నమోదు తప్పనిసరి అని, ఎపి ఎయిమ్స్ ఆధారంగా నమోదైన వారికి మాత్రమే కొనుగోలుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ఎంఎస్ ద్వారా కొనుగోలు సమాచారాన్ని కొనుగోలు, తేదీ, కేంద్రం, పరిమాణం రైతులకు తెలిసే విధంగా షెడ్యూల్ అయిన రైతులకే కొనుగోలు అనుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బేల్ నాణ్యత తోరణం తీగలు తొలగించి సమానమైన ఆకృతిలో ఉండాలని, తేమ 20 శాతం కన్నా తక్కువ, బరువు 25 నుంచి 150 కిలోల మధ్య ఉండాలన్నారు. పండుగుల్ల పొగాకు ఉండకూడదని, పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నా రు. పట్టాను బట్టి తరుగు ఉంటుందని, సన్నని పట్టాకు కిలో తగ్గింపు, మందపాటి పట్టాకు 2 కిలోల తగ్గింపు ఉంటుందని తెలిపారు. డిజిటల్ చెల్లింపులు ఉంటాయన్నారు. కొనుగోలు ప్రక్రియ సందేహాల కోసం వ్యవసాయ అధికారులు లేక మార్క్‌ఫెడ్ సిబ్బందిని సంప్రదించాలన్నారు.


సారెలతో ఆలయానికి చేరుకున్న మహిళలు

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన జనం

- ఆషాఢ సారెలతో పెద్ద ఎత్తున మహిళలు రాక

ప్రజాశక్తి-విజయవాడ

తొలి ఏకాదశి సందర్భంగా ఇంద్రకీలాద్రికి యాత్రికులు పోటెత్తారు. తొలి ఏకాదశి పండుగతో పాటు ఆషాడమాసంలో కనకదుర్గమ్మకు సారె ఇస్తే శుభం కలుగుతుందనే ఉద్దేశంతో యాత్రికులు ఆలయానికి పెద్దఎత్తున తరలి వచ్చారు. దీంతో ఘాట్ రోడ్డు యాత్రికులతో కిక్కిరిసిపోయింది. క్యూలైన్ల రద్దీని ఆలయ ఇఒ శీనానాయక్, ఎఇఒలు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. రద్దీ దృష్ట్యా అంతరాలయ దర్శనాలకు అనుమతిపై నియంత్రణ విధించారు. సిసి కెమెరాల ద్వారా రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. తొలి ఏకాదశి నేపథ్యంలో డిజిపి హరీష్‌కుమార్ దంపతులు కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.

'ప్రైవేటు'కు ప్రజారోగ్యం సేవలు

- ఎస్ఎంఎస్ఎస్ వ్యవస్థ పేరుతో 6 నగరపాలక సంస్థల్లో త్వరలో ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నగరపాలక సంస్థల్లో దోమల నివారణకు ప్రజారోగ్య విభాగం సేవలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎఐ ఆధారిత టెక్నాలజీతో దోమల నివారణకు స్మార్ట్ దోమల నిఘా వ్యవస్థ (ఎస్ఎంఎస్ఎస్)ను ఎంపిక చేసిన నగరపాలక సంస్థల్లో పైలెట్ ప్రాజెక్టుగా త్వరలో చేపట్టనుంది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్ కుమార్ ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎఐ టెక్నాలజీతో పనిచేసే ఈ వ్యవస్థను తొలి విడతగా ఆరు నగరపాలక సంస్థల్లో 66 ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్లు, హీట్ మ్యాప్స్, సెన్సార్లు, ట్రాప్స్ వంటి ఇంటర్నెట్ ఆధారంగా పనిచేసే సాధనాల సహాయంతో ఈ కార్యక్రమాన్ని మరింత సమర్ధవంతంగా పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థలో 16 ప్రాంతాల్లో, కాకినాడలో 4, రాజమండ్రిలో 5, విజయవాడలో 28, నెల్లూరులో 7, కర్నూలులో 6 ప్రాంతాల్లో ఈ పైలెట్ ప్రాజెక్టు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఒక ప్రైవేటు ఏజెన్సీ అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థలను ఇటీవల పురపాలకశాఖ ఉన్నతాధికారులు అధ్యయనం చేసినట్లు చెప్పారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఎఐ టెక్నాలజీతో కూడిన సెన్సార్‌లు ఏర్పాటు చేస్తారని, ఈ సెన్సార్లు దోమలను గుర్తించి వాటి జాతులు, సాంద్రత, ఉష్ణోగ్రత, తేమలను గురించి వివరాలను కేంద్ర సర్వర్‌కు అందిస్తాయన్నారు. దోమల సాంద్రత పరిమితికి మించిన సమయంలో ఎస్ఎంఎస్ఎస్ హెచ్చరికలు జారీ చేస్తోంది. సెన్సార్ల నుంచి సేకరించిన డేటాను విశ్లేషించి దోమల నివారణకు అవసరమైన ప్రాంతాల్లో అధికారులు చర్యలు చేపడతారన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న బ్లైండ్ స్ప్రేయింగ్ ప్రక్రియకు బదులుగా దోమల సాంద్రతను పర్యవేక్షించి చర్యలు తీసుకోవడం వల్ల ఫలితాలు అధికంగా ఉంటాయని చెప్పారు. ఈ కార్యకలాపాలను పూర్తిగా ప్రత్యేక ఏజెన్సీలకు అవుట్‌సోర్సింగ్ విధానంలో కేటాయిస్తామని, కార్యాచరణ, జవాబుదారీతనం, ఫలితాల ఆధారంగా చెల్లింపులు ఉంటాయని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ట్రాక్ చేస్తామని చెప్పారు. మరోవైపు ఆస్పత్రుల నుంచి మలేరియా, డెంగీ కేసుల గురించి రోజువారీ రిపోర్టింగ్ కోసం మరో వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ డేటా ఆధారంగా దోమల హాట్ స్పాట్లు గుర్తించనున్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలి

- ఎపి జెఎసి ఛైర్మన్ విద్యాసాగర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలని ప్రభుత్వాన్ని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు, జెఎసి ఛైర్మన్ ఎ విద్యాసాగర్ కోరారు. రాష్ట్రస్థాయి పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గ సమావేశం విజయవాడలోని ఎపి ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ఉద్దేశంతోనే ఈ సమావేశం నిర్వహించామన్నారు. మొత్తం 6 గ్రేడ్‌లను 3 గ్రేడ్‌లకు కుదించాలనే ప్రభుత్వం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులపై రోజురోజుకూ పెరుగుతోన్న ఒత్తిడిని తగ్గించేందుకు సమయపాలనలో మార్పులు చేయాలని కోరారు. పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లు వీడియో కాలింగ్ చేయాలన్న విధానాన్ని తొలగించాలని, ఈ అంశంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వైవిడి ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల పరిపాలనా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర కార్యదర్శి డివి రమణ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం స్పిల్‌వే నుంచి 2,23,309 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. దీంతో పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి చేరుకున్న 2,23,309 క్యూసెక్కుల అదనపు నీటిని అధికారులు ఆదివారం దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 28.220 మీటర్లు, దిగువన 18.740 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్‌కి ఎగువన 28.370 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్‌కి దిగువన 17.770 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌కి మధ్య 15.680 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు దిగువన 6.66 మీటర్లు నమోదైందని, ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం తగ్గుతూ వస్తోందని సిడబ్ల్యూసి అధికారులు తెలిపారు. భారీ వర్షాలతో ప్రాజెక్టులు నిండి, సామర్థ్యానికి మించి నీటిని దిగువకు విడుదల చేయడంతో గోదావరిలో వరద నీరు చేరుతోంది. దీంతో ముంపు మండలాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముందు జాగ్రత్తగా పునరావాస కేంద్రాలకు వెళుతున్నారు.

'కరేడు' భూసేకరణకు వ్యతిరేకం

- మాజీ మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఉలవపాడు మండలం, కరేడు గ్రామంలో రైతుల నుంచి బలవంతంగా పంట భూములు తీసుకోవడం దుర్మార్గమని, ఈ చర్యను వైసిపి తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరేడులో బలవంతపు భూసేకరణకు ప్రభుత్వం పూనుకుంటే రైతుల పక్షాన ఉద్యమించనున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఇండోసోల్‌కు 8,348 ఎకరాలు సేకరించాలని నిర్ణయించిందని, ఈ మేరకు రావూరు, చేవూరు గ్రామాల్లో 4,827 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఇండోసోల్ రూ.417 కోట్లు ప్రభుత్వానికి చెల్లించి, పనులు ప్రారంభించిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉన్నట్లుండి ఇండోసోల్ ప్రాజెక్టు పనులు నిలిపివేసి వేరే ప్రాంతానికి మార్చాలని ఆదేశించిందని తెలిపారు. ఇందుకోసం కరేడులో 8 వేల ఎకరాలు సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు.

పార్టీ కమిటీల నియామకం పూర్తి చేయాలి

పార్టీ కమిటీల ఏర్పాటు వెంటనే పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలతో ఆదివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీలో చురుగ్గా పని చేయాలనుకునే అనుబంధ విభాగాల వారికి కమిటీల్లో అవకాశం ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల్లో పదవుల్లో ఉన్నవారిని గుర్తించి కమిటీల్లో ప్రాధాన్యత ఇవ్వాలని నియోజకవర్గ నాయకులకు సూచించారు. బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమానికి అసెంబ్లీ స్థాయిలో స్పందన కనిపిస్తోందన్నారు. ఈ నెల 8న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పార్టీ పెద్దయెత్తున నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

అప్పులు తప్ప అభివృద్ధి లేదు

- డబుల్ ఇంజన్ అయినా కేంద్రం నిధులివ్వదు
- పవన్‌లో తగ్గిన ఉత్సాహం : సిపిఐ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో రూ.లక్షల కోట్లు అప్పు చేశారేగాని అభివృద్ధి మాత్రం కనిపించడంలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఇప్పటి వరకు ఎంత అప్పు చేశారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో విలేకర్లతో మాట్లాడుతూ.. అదాని, అంబాని, ఇతర కార్పొరేట్ సంస్థలకు దాసోహమైన కేంద్ర ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను వారికి తాకట్టు పెడుతోందని, ఆర్థికంగా భారతదేశాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తప్పుడు లెక్కలను చూపిస్తూ దేశంలో పేదలు 2.3 శాతం మాత్రమే ఉన్నారనడం ఘోరమన్నారు. దేశవ్యాప్తంగా 50 కోట్ల మందికి, రాష్ట్ర వ్యాప్తంగా కోటి 40 లక్షల మందికి రేషన్ బియ్యం ఎందుకు పంపిణీ చేస్తున్నారని ప్రశ్నించారు. దేశాన్ని మోడీ, అమిత్ షా తమ చెప్పు చేతల్లో పెట్టుకుంటున్నారని విమర్శించారు. డబుల్ ఇంజన్ పేరుతో పాలన సాగిస్తున్న మోడీ రాష్ట్రానికి ఏమైనా నిధులు ఇచ్చారా? అని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ ప్రస్తుతం సినిమాలకే పరిమితమయ్యారని, సీజ్ ది షిప్ ఏమైందని ఎద్దేవా చేశారు. పదవి వచ్చిన తొలినాళ్లలో ఉన్న ఉత్సాహం ఇప్పుడాయనలో లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ నియోజకవర్గ, జిల్లా స్థాయి సభలు పూర్తయిన తర్వాత ఒంగోలులో రాష్ట్ర మహాసభ, అనంతరం జాతీయ మహాసభ చండీగఢ్‌లో జరగనుందని తెలిపారు.

అమెరికాలో కొత్త పార్టీ

- టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రకటన

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాజీ సహచరుడు, బిలియనీర్ ఎలాన్ మస్క్ 'అమెరికా పార్టీ' పేరిటనూతన రాజకీయ పక్షాన్ని ఏర్పాటు చేశారు. కోల్పోయిన స్వేచ్ఛను తిరిగి అమెరికా ప్రజలకు అందించడమే తన పార్టీ లక్ష్యమని ఆయన చెప్పారు. 'ఇప్పుడు మనం ఏక పార్టీ వ్యవస్థలో జీవిస్తున్నాం. ప్రజాస్వామ్యంలో కాదు. మీ స్వేచ్ఛను తిరిగి మీకు అందజేసేందుకే ఈ రోజు అమెరికా పార్టీ ఆవిర్భవించింది' అని స్పేస్ ఎక్స్, టెస్లా అధినేత మస్క్ తన సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో తెలిపారు. పార్టీ ఏర్పాటుకు సన్నాహకంగా...అమెరికా స్వాతంత్ర్యదినోత్సవమైన శుక్రవారం నాడు ఆయన ఎక్స్‌లో ఓ పోల్ నిర్వహించారు. 'రెండు పార్టీల (కొందరు ఒకే పార్టీ అంటారు) వ్యవస్థ నుండి మీరు స్వేచ్ఛ కోరుకుంటున్నారా' అని ఆయన ప్రజలను ప్రశ్నించారు. ఈ సర్వేకు 12 లక్షల మంది అమెరికన్లు స్పందించారు. వీరిలో 65 శాతం మంది మస్క్ పార్టీకి జై కొట్టారు. ఈ నేపథ్యంలో...ప్రజాభీష్టం మేరకు నూతన రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నానని శనివారం ఆయన ప్రకటించారు.

ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తి

తన పోస్ట్‌కు మస్క్ రెండు తలల పామును జోడించి మీమ్‌ను ప్రదర్శించారు. 'ఏక పార్టీ పాలనకు స్వస్తి' అని దాని కింద క్యాప్షన్ పెట్టారు. ఇదిలావుండగా క్వాంటస్ సంస్థ నిర్వహించిన ఓ సర్వేలో 40 శాతం మంది అమెరికన్లు కొత్త పార్టీపై సానుకూలత వ్యక్తం చేయడం విశేషం. మస్క్ పార్టీకి తప్పనిసరిగా మద్దతు ఇస్తామని 14 శాతం మంది, ఆ అవకాశం ఉన్నదని 26 శాతం మంది చెప్పారు. తాము మస్క్ పార్టీని సమర్థించే అవకాశం ఉన్నదని రిపబ్లికన్లలో 57 శాతం మంది స్పష్టం చేయడం గమనార్హం. స్వతంత్రులలో 47 శాతం మంది మస్క్‌కు మద్దతు తెలిపారు. అయితే డెమొక్రాట్లలో మాత్రం మస్క్‌కు పెద్దగా మద్దతు లభించడం లేదు. కేవలం ఏడు శాతం మంది మాత్రమే ఆయన పక్షాన నిలిచారు. రెండు పార్టీల పైన అమెరికన్లు అసంతృప్తి వ్యక్తం చేయడం మరో ఆసక్తికరమైన పరిణామం. రిపబ్లికన్లు కానీ, డెమొక్రాట్లు కానీ అమెరికా విలువలకు ప్రాతినిధ్యం వహించరని 59 శాతం మంది స్వతంత్రులు అభిప్రాయ పడ్డారు. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే మరో రాజకీయ పార్టీ అవసరం ఉన్నదని చెబుతున్న వారందరూ మస్క్ వైపు లేరు. కానీ ప్రస్తుత రాజకీయ వ్యవస్థతో వారు విసిగి వేసారిపోయారన్న వాస్తవాన్ని ఈ సర్వే ప్రతిబింబిస్తోంది.

అంత ఈజీ కాదు

పార్టీ ఆవిర్భావం గురించి మస్క్ ప్రకటన అయితే చేశారు కానీ దానిని ఓ జాతీయ పార్టీగా తీర్చిదిద్దడం అంత సులభం కాదని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎందుకంటే అమెరికాలో బ్యాలెట్‌లో చోటు దక్కించుకోవాలంటే ఒక్కో రాష్ట్రానికి ఒక్కో నిబంధన ఉంటుంది. ఉదాహరణకు ఒక్క కాలిఫోర్నియా రాష్ట్రంలోనే 75.000 మంది నమోదైన సభ్యుల మద్దతు కానీ 11 లక్షల సంతకాలు కానీ అవసరమవుతాయి. చట్ట ప్రకారం మూడో పార్టీ ఏర్పాటు చాలా కష్టమని ఎన్నికల న్యాయవాది బ్రెట్ కప్పెల్ చెప్పారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీ ఒకటీ నెరవేర్చలేదు

- రాష్ట్ర ప్రభుత్వ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాకర్ల వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి- తాడేపల్లి (గుంటూరు జిల్లా)

అధికారం కోసం ప్రభుత్వ ఉద్యోగులకు అనేక అహామీలనిచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని రాష్ట్ర ప్రభుత్వ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాకర్ల వెంకటరామిరెడ్డి విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ఇచ్చిన తొమ్మిది హామీల్లో దేన్నీ నెరవేర్చలేదని అన్నారు. అధికారం చేపట్టి ఏడాదైనా ఉద్యోగస్తులకు డిఎ, ఐఆర్ విడుదల చేయకపోవడం దారుణమని విమర్శించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులైజ్ చేయాలని, ఆప్కాస్‌ను తొలగించి ప్రయివేట్ ఏజెన్సీలను తీసుకురావటాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పెన్షనర్స్ కార్పొరేషన్ ఏర్పాటు ప్రకటనకు అతీగతీలేదని విమర్శించారు. టీచర్ల బదిలీలు సరిగా చేయలేదని తెలిపారు. యాప్‌ల పేరుతో టీచర్లను ఇబ్బందులు పెడుతున్నారని, వివిధ సర్వేల పేరుతో సచివాలయ ఉద్యోగులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగైన పిఆర్‌సిని ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తామనే హామీని విస్మరించారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఇప్పటికైనా దృష్టి పెట్టాలని, జాయింట్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని కోరారు. బకాయిలను షెడ్యూల్ ప్రకారం ఇవ్వాలన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టిస్తూ పోలీసు వ్యవస్థను దిగజార్చారని, పోలీసులకు రెండు ఎస్ఎల్ ఇస్తామని చెప్పి ఒక్కటే ఇచ్చారని తెలిపారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించకుంటే ప్రజా కోర్టులో తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఫెడరేషన్ నాయకులు ఎల్.జమాత్‌రెడ్డి, పి.అశోక్ కుమార్‌రెడ్డి, ఆర్.సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, అనిల్, ఆలీ, కరిముల్లా, ఎ.రాధాకష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్నేహితులూ ఛీకొడుతున్నారు !

- ట్రంప్‌పై విమర్శల వెల్లువ
- ఎలాన్ మస్క్ నుంచి మైక్ పెన్స్ వరకు



న్యూయార్క్ : అమెరికా అధ్యక్షులుగా రెండో సారి పగ్గాలు చేజిక్కించుకొని ఆరు నెలలైనా గడవక ముందే డోనాల్డ్ ట్రంప్ విమర్శల వలయంలో చిక్కుకున్నారు. ఈ విమర్శలు చేస్తున్నవారిలో చాలామంది గతంలో ఆయనకు అత్యంత సన్నిహితులుగా వ్యవహరించినవారే కావడం విశేషం. అపర కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ నుంచి మాజీ వైస్ ప్రెసిడెంట్ మైక్ పెన్స్ దాకా ఎంతో మంది ఇప్పుడు ట్రంప్ విధానాలను ఛీకొట్టి ఆయనకు వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్'ను తీవ్రంగా తప్పుబడుతున్నారు. అమెరికా అనుసరిస్తున్న విదేశాంగ విధానాలనూ తూర్పారబడు తున్నారు. ట్రంప్ స్నేహితుల లిస్టు నుంచి విమర్శకుల జాబితాలోకి చేరిపోయిన ప్రముఖుల వివరాలు..

ఎలాన్ మస్క్ - మాజీ 'డోజ్' సారథి

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపులో ఎలన్ మస్క్ కీలక పాత్ర పోషించారు. దీంతో ట్రంప్ ప్రెసిడెంట్ కాగానే మస్క్ కోసం కొత్తగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్)ని ఏర్పాటు చేశారు. ఇటీవలే డోజ్ విభాగానికి మస్క్ రాజీనామా చేశారు. అధికారికంగా రాజీనామా చేయడానికి ముందు నుంచే ట్రంప్ పాలనా విధానాలను, ప్రత్యేకించి ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్'లోని అంశాలను మస్క్ తప్పుపట్టారు. చాలా దారుణమైన ప్రతిపాదనలతో ఆ బిల్లు ఉందని విమర్శించారు. మస్క్ అంతటితో ఆగకుండా, సెక్స్ స్కాండల్‌కు పాల్పడిన జెఫ్రీ ఎప్‌స్టీన్ నుంచి ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు సేకరించిన ఫైల్స్ (రిలీజ్ చేయనివి)లో ట్రంప్ కూడా కనిపించారని సంచలన ఆరోపణ చేశారు. మస్క్ ఆరోపణలన్నీ అవాస్తవాలు అంటూ వైట్‌హౌస్ నుంచి ఓ ప్రకటన విడుదలైంది. మస్క్‌కు మతిభ్రమించిందని, ఆయన కంపెనీల 38 బిలియన్ డాలర్ల విలువైన ప్రభుత్వ కాంట్రాక్టులను రద్దు చేస్తానంటూ ట్రంప్ బెదిరించారు కూడా. ఈ క్రమంలోనే మస్క్ 'ది అమెరికా పార్టీ' అనే కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేశానంటూ ఎక్స్ వేదికగా కలకలం రేపారు.

మైక్ పెన్స్ - అమెరికా మాజీ వైస్ ప్రెసిడెంట్

ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడయ్యాక మైక్ పెన్స్‌ను వైస్ ప్రెసిడెంట్‌గా నియమించుకున్నారు. ఈయన 2017 జనవరి 20 నుంచి 2021 జనవరి 20 దాకా ఈ పదవిలో కొనసాగారు. అమెరికా సైనిక వ్యవహారాలపై మంచి పట్టున్న మైక్ పెన్స్ నుంచి ఈ అంశాల్లో సలహాలన్నీ ట్రంప్ తీసుకునేవారు. 2020 నవంబరులో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓడిపోయిన అనంతరం వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్‌పై ట్రంప్ అనుచరులు దాడికి పాల్పడ్డారు. దీనికి సూత్రధారి మైక్ పెన్స్ అంటూ కథనాలు వచ్చాయి. ఈ ఇద్దరి స్నేహం 2021 జనవరి 6న దెబ్బతింది. జోబైడెన్ ఎన్నికల్లో గెలిచినట్టుగా సర్టిఫికెట్‌ను జారీ చేయొద్దని మైక్ పెన్స్‌కు ట్రంప్ నిర్దేశించగా, పెన్స్ నిరాకరించారు. దీంతో ఆయనపై ట్రంప్ బహిరంగంగా విమర్శలు చేశారు. అనంతరం క్యాపిటల్ హిల్ వద్ద నిరసనకు దిగిన ట్రంప్ వర్గీయులు 'మైక్ పెన్స్‌ను ఉరితీయండి' అంటూ నినాదాలు చేశారు. దీనిపై పెన్స్ అప్పట్లో స్పందిస్తూ రాజ్యాంగానికి అతీతంగా వ్యవహరించాలని భావించే వారు అమెరికా అధ్యక్షుడు కాకూడదన్నారు.

జాన్ బోల్టన్ - మాజీ జాతీయ భద్రతా సలహాదారు

ట్రంప్ తొలిసారి అధ్యక్షుడు అయ్యాక జాన్ బోల్టన్‌ను అమెరికా జాతీయ భద్రతా సలహాదారుడిగా నియమించుకున్నారు. 2018 ఏప్రిల్ 9 నుంచి 2019 సెప్టెంబరు 10 వరకు ఈ పదవిలో ఆయన కొనసాగారు. ఇరాన్, ఉత్తర కొరియాలకు సంబంధించిన విదేశాంగ విధానానికి రూపకల్పన చేసే క్రమంలో ట్రంప్‌తో విభేదాలు రావడంతో 17 నెలలకే వైదొలిగారు. తానే రాజీనామా చేశానని బోల్టన్ ప్రకటించగా, తానే తీసేశానని ట్రంప్ చెప్పుకున్నారు. 'చూసి నవ్వుకోదగిన మూర్ఖుడు ట్రంప్' అని ప్రపంచ దేశాల నేతలు భావిస్తున్నారని బోల్టన్ విమర్శించారు. ఈసారి ట్రంప్ అధికారంలోకి రాగానే జాన్‌బోల్టన్ సెక్యూరిటీ క్లియరెన్స్‌ను రద్దు చేశారు. ఆయన తెలివితక్కువ దద్దమ్మ అని ట్రంప్ ప్రభుత్వవర్గాలు భాష్యం చెప్పాయి.

జాన్ కెల్లీ - మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్

ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జాన్ కెల్లీ అమెరికా చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా సేవలు అందించారు. 2017 జులై 31 నుంచి 2019 జనవరి 2 వరకు ఈ పదవిలో కొనసాగారు. పదవి నుంచి వైదొలగినప్పటి నుంచి జాన్ కెల్లీ, ట్రంప్ విమర్శకుడిగా మారిపోయారు. ట్రంప్ ఒక ఫాసిస్ట్, నియంత అని ఓ వార్త సంస్థతో చెప్పుకొచ్చారు. సానుభూతి పూర్వక ఆలోచనలు ట్రంప్‌లో లేవన్నారు. పాలకులకు హిట్లర్ ఒక రోల్ మోడల్ కావాలని ట్రంప్ చాలాసార్లు చెప్పగా, ఆ వ్యాఖ్యలను తాను అప్పటికప్పుడు సరిచేయించానని జాన్ కెల్లీ తెలిపారు.

జిమ్ మ్యాటిస్ - మాజీ రక్షణ మంత్రి

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ తొలి హయాంలో జిమ్ మ్యాటిస్ రక్షణ మంత్రిగా సేవలు అందించారు. ఈయన 2017 జనవరి 20 నుంచి 2019 జనవరి 1 వరకు ఈ పదవిలో కొనసాగారు. సిరియా నుంచి అమెరికా సేనలను ఉపసంహరించుకోవాలనే ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అప్పట్లో జిమ్ మ్యాటిస్ రాజీనామా చేశారు. 2020లో జిమ్ మ్యాటిస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రజలను ఏకంచేయకపోగా, విభజించి ఉంచేందుకు ట్రంప్ ఉద్దేశపూర్వకంగానే యత్నిస్తుంటారని ఆయన ఆరోపించారు.

మార్క్ మిల్లే - జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ మాజీ ఛైర్మన్

ట్రంప్ తొలి హయాంలో అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్‌గా మార్క్ మిల్లే పనిచేశారు. 2015 ఆగస్టు 14 నుంచి 2019 ఆగస్టు 9 వరకు ఆ పదవిలో కొనసాగారు. రాజీనామా చేశాక ట్రంప్ ఒక ఫాసిస్ట్ అని, అమెరికాలోనే అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని అభివర్ణించారు. జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మెన్ హోదాలో చైనాతో మార్క్ మిల్లే అప్పట్లో చర్చలు జరిపారు. చైనాపై అమెరికా అణ్వస్త్రాలను ప్రయోగించబోదనే హామీని పునరుద్ఘాటిస్తూ ఆనాడు చైనా సర్కారు పెద్దలతో మార్క్ మిల్లే దౌత్యం నెరిపారు. ఈవిషయం తెలియడం వల్ల ట్రంప్ భగ్గుమన్నారు. అది తెలివితక్కువ చర్య అని, ఇలాంటి పనిని చేసేవారికి మరణశిక్ష పడుతుందని వార్నింగ్ ఇచ్చారు. 2023లో మీడియాతో మార్క్ మిల్లే మాట్లాడుతూ ట్రంప్ ఒక నియంత అని చెప్పారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

(మొదటిపేజి తరువాయి)

మృతి చెందినట్లు చరిత్ర చెబుతోంది. అక్కడి నుంచి తలలేకుండా కేవలం మొండేలతో నెల్లూరు చెరువు వద్దకు గుర్రాలపై వీరి మృతదేహాలు చేరుకున్నాయని చెపుతారు. అక్కడే వారిని సమాధి చేసి ఈ ప్రాంతానికి బారా (12) షాహీద్ దర్గాగా నామకరణం చేశారు. నెల్లూరు చెరువు పేరును స్వర్ణాల చెరువుగా మార్చారు. ఇక్కడ రొట్టెల పండగ ఏటా నిర్వహిస్తున్నారు. ఇక్కడ స్వర్ణాల చెరువులో స్నానం చేసి కోర్కెలు కోరుకొని రొట్టెలు వదిలితే అవి నెరవేరుతాయని విశ్వసిస్తారు. ఇలా ఇది ప్రాచుర్యం పొందడంతో ఏటా యాత్రికుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఏటా 20 నుంచి 30 లక్షల మంది యాత్రికులు వస్తారని అంచనా. 6వ తేదీ సంధల్ మాల్, 7న గంధమహోత్సవం, 8న రొట్టెల పండగ, 9న తహలీల్ ఫాతేహ, 10న ముగింపు వేడుకలతో రొట్టెల పండగ ముగియనుంది. రొట్టెల పండగకు తరలివచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ఎస్‌పి కృష్ణతేజ, జాయింట్ కలెక్టర్ కార్తీక్, మున్సిపల్ కమిషనర్ నందన్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలు ఇస్తున్నారు. సోమవారం మంత్రి నారా లోకేష్ రొట్టెల పండగకు హాజరు కానున్నారు.

భవిష్య విద్యా సంస్థల అధినేత శ్రీధర్ ఆత్మహత్య



ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి పట్టణానికి చెందిన భవిష్య విద్యా సంస్థల అధినేత ఇమడాబత్తిన శ్రీధర్ (50) ఆత్మహత్య చేసుకున్నారు. రెండు రోజుల క్రితం దేవాలయానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుండి వెళ్లిన ఆయన విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నదిలోకి దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకోవడంతో ఆయన భార్య ఉమా కల్యాణి సత్తెనపల్లి పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద శ్రీధర్ ద్విచక్ర వాహనాన్ని పోలీసులు గుర్తించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది ఆదివారం ఉదయం కృష్ణా నదిలో గాలించగా బ్యారేజీ సమీపంలో శ్రీధర్ మృతదేహాన్ని కనుగొని బయటకు తీశారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. శ్రీధర్ మృతికి పలు ప్రయివేటు పాఠశాలల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

నష్టకరమైన హైడ్రో వద్దు

చిట్టెంపాడు వద్ద గిరిజనుల నిరసన

ప్రజాశక్తి - అనంతగిరి (అల్లూరి జిల్లా)

చిట్టెంపాడు వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఆదివాసీలకు తీవ్ర నష్టం జరుగుతుందని, ప్రాజెక్టు అనుమతులను రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకుంటే తరిమి తరిమి కొడతామని హెచ్చరించారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ పరిధిలోని ప్రాజెక్టు ప్రతిపాదిత చిట్టెంపాడు ప్రాంతాన్ని సురేంద్ర, అనంతగిరి జడ్‌పిటిసి సభ్యులు డి.గంగరాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య తదితరులు ఆదివారం పరిశీలించారు. స్థానిక గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిజనులతో అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ.. చిట్టెంపాడు వద్ద నవయుగ సంస్థకు హైడ్రో పవర్ ప్రాజెక్టును కట్టబెట్టే క్రమంలో లోపాయికారీ ఒప్పందం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 1/70, పీసా, గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా అల్లూరి ఏజెన్సీలోని పెదకోట, చిట్టెంపాడు, గుజ్జెలి ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను, సర్వేలను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల మనుగడకు ముప్పు తలపెట్టే హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలను సహించబోమని హెచ్చరించారు. చిట్టెంపాడు వద్ద ప్రాజెక్ట్ నిర్మించడం వల్ల టోకూరు,



చిట్టెంపాడు వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతంలో నిరసన తెలుపుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు, గిరిజనులు

పెదబిడ్డ, లుంగుపర్తి పంచాయతీల పరిధిలో సుమారు 20 గ్రామాల్లోని ఆదివాసీల పంటలు, జీవనోపాధి దెబ్బతింటాయన్నారు. అనంతగిరిలో నిర్మిస్తున్న మూడు హైడ్రో పవర్ ప్రాజెక్టుల వల్ల పది వేల మంది ఆదివాసీలకు నష్టం జరగనుందని తెలిపారు. పీసా గ్రామసభలను సంప్రదించకుండా ప్రాజెక్టుల నిర్మాణానికి ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిస్తూ జిఒ 51ని జారీ చేసిందన్నారు. గంగరాజు, బాలదేవ్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీల పట్ల గత, ప్రస్తుత ప్రభుత్వాల విధానాలు ఒక్కటేనని తెలిపారు. అదాని, నవయుగ కంపెనీలకు లాభం చేకూర్చడమే పాలకుల విధానంగా ఉందన్నారు. ఆదివాసీలకు నష్టం చేకూర్చే విధానాలను పోరాటాలతో ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.నాగులు, పెద్దబిడ్డ ఎంపిటిసి సభ్యులు జయశ్రీ, వంతల. బుద్రయ్య, బోయిన చంద్రన్న, పీసా కమిటీ సభ్యులు పాంగి మధు, ఎస్.ఆనంద్, గెమ్మెల భీమరాజు, చిన్నారావు పాల్గొన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ మండలాల్లోని పలు ప్రాంతాల్లో గిరిజనులు నిరసన తెలిపి జిఒ 51 ప్రతులను దగ్ధం చేశారు.



తోటపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి

చివరి ఆయకట్టుకూ సాగునీరు

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి
- తోటపల్లి ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల

ప్రజాశక్తి - గురుగుబిల్లి (పార్వతీపురం మన్యం జిల్లా)

తోటపల్లి జలాశయం నుంచి చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తామని, రైతులు ఎలాంటి ఆందోళనా చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జల్లా గురుగుబిల్లి మండలంలోని తోటపల్లి జలాశయం నుండి పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని దాదాపు 17 మండలాల్లోని చిన్న నీటిపారుదల ట్యాంకులను నింపడానికి ఆదివారం సాగు నీటిని ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ.. తోటపల్లి ప్రాజెక్టు మూడు జిల్లాలకు ఉపయోగపడుతుందన్నారు. లస్కర్ల నియామకానికి ప్రతిపాదనలు పంపామని, వీరిని శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. కొమరాడ మండలంలోని పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సిఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, జంఝావతి, కొటియా సమస్యలపై ఒడిశా ముఖ్యమంత్రితో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఉపాధి హామీ పనులకు అడ్డంకులు సృష్టించొద్దని సర్పంచులకు విజ్ఞప్తి చేశారు. రైతులకు సకాలంలో ఎరువులు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఇరిగేషన్ ఎస్ఇ కెవిఎన్ స్వర్ణ కుమార్, తోటపల్లి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హెచ్ మన్మధరావు, డిప్యూటీ ఇఇ బి.గోవిందరావు, రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యాశాఖలో గందరగోళం

- విద్యామండలి, కళాశాల విద్య మధ్య సమన్వయ లోపం
- డిగ్రీలో డబుల్ మేజర్‌పై వెనక్కి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్యాశాఖలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. కళాశాల విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి మధ్య సమన్వయం లేకపోవడంతో ఉన్నత విద్య ప్రవేశాలపై ప్రభావం పడింది. డిగ్రీలో మేజర్ సబ్జెక్టు విధానం, అడ్మిషన్ల ప్రక్రియపై ఇరువురి మధ్య సమన్వయం కొరవడటంతో ఇప్పటి వరకు వీటిపై నిర్ణయం వెలువరించలేదు. మరోపక్క విద్యాశాఖ మంత్రి సైతం ఈ అంశాలను తేల్చలేకపోతున్నారనే చర్చ ఉన్నత విద్యలో నడుస్తోంది. డిగ్రీలో 2023-24 విద్యాసంవత్సరం నుంచి సింగిల్ మేజర్ విధానాన్ని వైసిపి ప్రభుత్వం ఏకపక్షంగా అమల్లోకి తెచ్చింది. ఈ విధానాన్ని విద్యావేత్తలు, విద్యార్థులు కూడా వ్యతిరేకించారు. కూటమి ప్రభుత్వం దీనిని రద్దు చేసి డబుల్ మేజర్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించింది. అందుకు అనుగుణంగానే ఈ ఏడాది అందరి స్టేక్ హోల్డర్లతో చర్చలను ఉన్నత విద్యామండలి నిర్వహించింది. సిలబస్‌ను ఖరారు చేయడంతో పాటు అమలు చేసేందుకు నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. డబుల్ మేజర్ విధానానికి అనుగుణంగా మార్పులు చేసుకోవాలని డిగ్రీ కళాశాలలకు ఉన్నత విద్యామండలి ఆదేశాలివ్వడంతోపాటు కొంత ఫీజును కూడా వసూలు చేసింది. ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉన్నత విద్యపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఉన్నత విద్యామండలి డబుల్ మేజర్ విధానం అమలు చేయాలని గట్టిగా కోరింది. అయితే కళాశాల విద్య దీనిని వ్యతిరేకించింది. డిగ్రీ అడ్మిషన్లు కూడా ఆన్‌లైన్‌లో చేయాలని ఉన్నత విద్యామండలి పట్టుబడితే కళాశాల విద్య దీనిని వ్యతిరేకించింది. మేజర్ విధానం, ఆన్‌లైన్ అడ్మిషన్లపై ఉన్నత విద్యామండలి చేసిన ప్రతిపాదనలపై మంత్రి అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో డబుల్ మేజర్‌ను వెనక్కి నెట్టి మరలా సింగిల్ మేజర్‌నే అమలు చేసేందుకు సిద్ధమైంది. అడ్మిషన్లు కూడా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ చేయాలని మంత్రి చెప్పారు.

సింగిల్ మేజర్ విఫలం : కళాశాల జెఎసి

డిగ్రీ విద్యలో సింగిల్ మేజర్ విధానం విఫలమైందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘాల ఐక్యవేదిక విమర్శించింది. డిగ్రీ విద్యను అభ్యసించే పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైవిధ్యంతో కూడిన అవకాశాలు డబుల్, లేదా ట్రిపుల్ మేజర్ విధానం ద్వారా మాత్రమే లభిస్తుందని వేదిక నాయకులు ఎం శ్యాంబాబు, (జిసిటిఎ ఎపి ప్రధాన కార్యదర్శి), ఎం శ్రీనివాసరెడ్డి (జిసిజిటిఎ ఎపి ప్రధాన కార్యదర్శి) తెలిపారు. విఫలమైన, సరైన అవకాశాలు లేని సింగిల్ మేజర్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకోకుండా తీసుకున్న ఈ నిర్ణయం విద్యార్థులను ఛాయిస్‌ను తగ్గించడంతో పాటు భవిష్యత్‌ను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. పలు కళాశాలల్లో ఉన్న కోర్సులకే విద్యార్థులు పరిమితమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే డబుల్ మేజర్ వ్యవస్థను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పూటకో విధానం : ఎస్‌ఎఫ్‌ఐ

రోజుకో మాట పూటకో విధానంలా ఉన్నత విద్యామండలి తీరు ఉందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ విమర్శించింది. డబుల్ మేజర్ విధానం అమలు చేస్తున్నామని ఉత్తర్వులిచ్చి ఆచరణలోకి వెళ్లకుండానే సింగిల్ మేజర్ కొనసాగిస్తామని చెప్పడం హాస్యాస్పదమని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, పి రామ్మోహన్ విమర్శించారు. గత ప్రభుత్వ విధానాలను నిలదీసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేడు అదే బాటలో అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. స్టేక్ హోల్డర్స్‌ను సంప్రదించకుండా ఇష్టానుసారంగా పూటకొక నిర్ణయం చేయడం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమేనని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించి మైనర్ సబ్జెక్టులకు క్రెడిట్ పాయింట్లు పెంచాలని కోరారు.

నగరాలకు బిసి(డి) కుల ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు : మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నగరాల సామాజిక వర్గీయులను బిసి(డి)లుగా గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేసేలా చర్యలు తీసుకుంటామని బిసి, ఇడబ్ల్యుఎస్ సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రిని నగరాల సామాజిక వర్గీయులతో కలిసి టిడిపి బిసి నగరాల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మరుపిళ్ల తిరుమలేష్ ఆదివారం కలిసి ఈ అంశంపై వినతిపత్రాన్ని అందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నగరాలకు బిసి (డి) కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ఉత్తర్వులున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కేవలం విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలతోపాటు కృష్ణా జిల్లాలో నగరాలకు బిసి (డి) కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మిగిలిన జిల్లాల్లో మంజూరు చేయకపోవడంతో ప్రభుత్వ పథకాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. కుల ధ్రువీకరణ పత్రాల జారీపై అధికారులతో చర్చిస్తానన్నారు. మంత్రిని కలిసిన వారిలో నగరాల సామాజికవర్గ ప్రతినిధులు కుమార్ నాయుడు, నల్లాని గిరిధర్, సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

సార్వత్రిక సమ్మెకు విద్యార్థి సంఘాలు మద్దతు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పది కేంద్ర కార్మిక సంఘాలు, అనేక అఖిల భారత సమాఖ్యలు జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ మేరకు ఆదివారం విద్యార్థి సంఘాల నేతలు శ్రీజన్ భట్టాచార్య (ఎస్‌ఎఫ్‌ఐ), దినేష్ సీరంగరాజ్ (ఎఐఎస్‌ఎఫ్), బలరామ్ సజీవ్ (పిఎస్‌యు), అమిత్ సింగ్ (ఎఐఎస్‌బి), ప్రసేన్‌జీత్ కుమార్ (ఎఐఎస్‌ఎ) సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మిక కోడ్‌లు బడా కార్పొరేట్‌లకు అపారమైన ప్రయోజనం చేకూరుస్తాయని, అదే సమయంలో కార్మికులు వేతనాలు, యూనియన్ హక్కులను కోల్పోతారని పేర్కొన్నారు. అలాగే కార్మికుల పని గంటలను పెంచుతారని తెలిపారు. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం విద్యా రంగంలో కూడా ఇలాంటి కార్పొరేట్ అనుకూల విధానాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. నూతన విద్యా విధానం- 2020 విద్యను నియంత్రించని వ్యాపారీకరణ లక్ష్యంగా పెట్టుకుందని, దీని ఫలితంగా విద్యపై చేయాల్సిన వ్యయాలు పెరుగుతున్నాయని అన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలకు అపారమైన లాభం, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మూసివేయడం, అణగారిన వర్గాల నుండి వచ్చే వేలాది మంది విద్యార్థులను విద్య నుండి దూరం చేయడం జరుగుతుందని దుయ్యబట్టారు. సామాన్య విద్యార్థుల పోరాటం దేశంలోని శ్రమజీవుల విస్తృ పోరాటాల నుండి వేరుగా ఉండదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల వివిధ రంగాల కార్మికులతో ప్రజలంతా బాధింపబడుతున్నాయని తెలిపారు. కార్మిక సంఘాలు ఇచ్చిన సార్వత్రిక సమ్మె పిలుపుకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్మికుల డిమాండ్లకు మద్దతుగా నిలిచి, సమాజంలోని అన్ని వర్గాల ప్రజాస్వామ్య హక్కుల కోసం సమ్మెలో భాగస్వామ్యం కావాలని దేశంలోని విద్యార్థి లోకానికి పిలుపు నిచ్చారు.

బ్యాంకుల్లో కొలువులకు సిద్ధం కండి...

పోటీ పరీక్షల ప్రత్యేకం




కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు తాజాగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబిపిఎస్) ద్వారా వచ్చిన నోటిఫికేషన్లు ఎంతో ఉపయోగకరం. ఇది భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే ఒక కేంద్ర నియామక సంస్థ. ఇది దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వివిధ బ్యాంకుల్లో ఉద్యోగాల నియామకాలకు పరీక్షలను నిర్వహిస్తుంది. క్లర్క్, పిఒ, స్పెషలిస్ట్ ఆఫీసర్ వంటి ఉద్యోగాల నియామకానికి కృషిచేస్తుంటుంది. ఎంచక్కా చక్కటి ప్రణాళికతో ప్రిపేరైతే బ్యాంకు ఉద్యోగాల్లో స్థిరపడొచ్చు. అందుకే ముందుగా బ్యాంకులు విడుదల చేసిన నోటిఫికేషన్లకు సవివరంగా చదవండి. ఆనక దరఖాస్తులు చేసేయండి. మీ చదువు, అర్హతల ఆధారంగా సరిపడే పోస్టులను గుర్తించండి. పోస్టు సాధించటమే లక్ష్యంగా నిరంతరం ప్రణాళికాబద్ధంగా కృషిచేయండి. తద్వారా బ్యాంకు కొలువుల్లో చేరిపోవచ్చు. పరీక్షల్లో విజయం సాధించటం అంత ఆషామాషీ విషయం కాదు. కొంత శ్రమించాల్సివుంటుంది. అధిక సమయం కేటాయించి ఆయా సబ్జెక్టులను అవపోసన పడితే విజయం తథ్యమే.

ఐబీపీఎస్ ఇచ్చిన నోటిఫికేషన్ల ద్వారా వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు, స్పెషలిస్ట్ ఆఫీసర్ల పోస్టులను భర్తీ చేయనుంది. 5208 ప్రొబేషనరీ ఆఫీసర్లు, 1007 స్పెషలిస్ట్ ఆఫీసర్ల పోస్టులు ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయబోతున్నారు. ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంకులకు ఎక్కువ సంఖ్యలో బ్రాంచీలు ఉన్నాయి. ఈ నోటిఫికేషన్‌లో ఇంకా ఆయా బ్యాంకుల ఖాళీల వివరాల ప్రస్తావన లేవు. అందువల్ల తుది నియామక సమయానికి మరింత పోస్టుల సంఖ్య పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

రీజనింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యత

గతేడాది జరిగిన ఐబిపిఎస్ పిఒ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలతో పోల్చితే ఈ సారి ఆయా పరీక్షల్లో కొంతమేరకు మార్పులు చేశారు. ప్రిలిమ్స్ అంశాలు, ప్రశ్నల సంఖ్యల్లో మార్పులేమీ లేకున్నా వాటికి కేటాయించిన మార్కుల్లో వ్యత్యాసాలున్నాయి. రీజనింగ్‌కు 5 మార్కులు పెంచి (40 మార్కులు), ఆప్టిట్యూడ్‌కు 5 మార్కులు (30 మార్కులు) తగ్గించారు. మెయిన్స్ పరీక్షలో కంప్యూటర్ ఆప్టిట్యూడ్ విభాగాన్ని తొలగించి, జనరల్ అవేర్‌నెస్ విభాగంలో కొత్తగా డిజిటల్, ఫైనాన్షియల్ అవేర్‌నెస్, ఆర్‌బిఐ సర్క్యులర్ల అంశాలను కలిపారు. ప్రశ్నల సంఖ్య, మార్కులు, సమయంలోనూ కొద్దిమేరకు మార్పులు చేశారు. రీజనింగ్‌కు ఎక్కువ మార్కులు కేటాయించారు. బాగా సాధన చేయాలి. ఈ క్రింది అంశాలను ఇంగ్లీష్ లాంగ్వేజ్‌లో కూడా బాగా చదవాలి.



కొత్తగా డిజిటల్, ఫైనాన్షియల్ అవేర్‌నెస్, ఆర్‌బీఐ సర్క్యులర్ల అంశాలు

జనరల్-బ్యాంకింగ్-ఎకనామిక్ అవేర్‌నెస్ విభాగంలో ఇంతకు ముందు సంవత్సరం ఉన్న కంప్యూటర్ ఆప్టిట్యూడ్ తొలగించి కొత్తగా డిజిటల్, ఫైనాన్షియల్ అవేర్‌నెస్, ఆర్‌బీఐ సర్క్యులర్ల అంశాలను చేర్చారు. దీని కోసం అభ్యర్థులు డిజిటల్ బ్యాంకింగ్‌కు సంబంధించిన విషయాలపై అవగాహన ఉండాలి. కొత్తగా వచ్చే విషయాలను కూడా తెలుసుకుంటూ ఉండాలి. యూపిఐ, డిజిటల్ వ్యాలెట్స్ (గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం మొదలైన అంశాలపై అవగాహన ఉండాలి), సైబర్ సెక్యూరిటీ, క్రిప్టో కరెన్సీ, ఆర్‌బీఐ సర్క్యులర్లు, రెపోరేటు మార్పులు, వార్షిక రిపోర్టులు, సూచనలు, అప్‌డేట్స్ మొదలైన అంశాలపై సమగ్ర అవగాహన ఉండటం మంచిది. తద్వారా ఆయా అంశాల్లో ఎలాంటి ప్రశ్నలు వచ్చినా సులభంగా జవాబులు చేయటానికి అవకాశం ఉంటుంది. వీటితోపాటు రెగ్యులర్‌గా ప్రశ్నలుండే బ్యాంకింగ్ సిస్టమ్, ఆర్‌బిఐ, మానిటరీ పాలసీ, ఇండియన్ ఎకానమీ, బడ్జెట్, ప్రభుత్వ పథకాలు, నీతి ఆయోగ్, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, ముఖ్యమైన వ్యక్తులు, ప్రదేశాలు, జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాల గురించి కూడా తెలుసుకోవాలి. తరచుగా నెమరువేసుకుంటూ ఉండాలి. వీటన్నింటికీ ప్రాధాన్యమిస్తూ గత ఐదారు నెలల తాజా పరిణామాలను చదవాలి.



ఎస్‌బిఐలో 541 పిఒలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) నుంచి ప్రొబేషనరీ ఆఫీసర్ల నియామకాలకు బ్యాక్‌లాగ్ ఖాళీలతో కలిసి 541 పోస్టులు భర్తీ చేయనున్నారు. గత కొన్నేళ్లుగా ఏడాది ద్వితీయార్థంలో అంటే నవంబర్, డిసెంబర్‌లో నోటిఫికేషన్ వచ్చేది. ఈ సారి ముందుగానే వచ్చేయటం అభ్యర్థులకు కొంత ఊరటనిస్తోంది. ఆరునెలల్లోనే రెండు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. గత నోటిఫికేషన్‌తో పోలిస్తే వేతనం కూడా భారీగా పెరిగింది. రూ.48,480 మూలవేతనంతో ప్రారంభమవుతుంది. అంటే దీనికి నాలుగు ముందస్తు ఇంక్రిమెంట్లు కలుస్తాయి. దీనికితోడు అభ్యర్థులకు డిఎ, హెచ్‌ఆర్‌ఎ, సిసిఎ, పిఎఫ్, ఎన్‌పిఎస్, ఎల్‌ఎఫ్‌సీ, మెడికల్ ఫెసిలిటీ, లీజ్ రెంటల్ ఫెసిలిటీ, ఇతర అలవెన్సులు, భత్యాలు, సదుపాయాలు లభిస్తాయి. ముంబై లాంటి ప్రాంతాల్లో పనిచేసే అభ్యర్థులకు వీటన్నింటినీ కలిపి వార్షిక వేతనం దాదాపుగా రూ.20.43 లక్షలు ఇస్తారు. మూడెంచల్లో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. మొదటిది ప్రిలిమినరీ. ఇందులో అర్హత సాధించిన అభ్యర్థుల్లో నుంచి ఖాళీల సంఖ్యకు పదిరెట్ల మందిని రెండో దశలోని మెయిన్స్ పరీక్షకు ఎంపిక చేస్తారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల్లో నుంచి ఖాళీల సంఖ్యకు మూడురెట్ల మందిని మూడోదశలోని గ్రూప్ ఎక్సర్‌సైజ్, ఇంటర్వ్యూలకు ఎంపిక చేస్తారు. దీనిలో అర్హత సాధించినవారి రెండో దశ, మూడో దశల్లోని మొత్తం మార్కులను అనుసరించి తుది ఎంపిక జరుగుతుంది. ప్రిలిమ్స్ జులై లేదా ఆగస్టులోనూ, మెయిన్స్ సెప్టెంబర్‌లో నిర్వహిస్తారు. మూడవ దశ ఆగస్టు, అక్టోబర్, నవంబర్‌లో, తుది ఫలితాలు నవంబర్, డిసెంబర్‌లో విడుదల చేస్తారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో జులై 3న 'నేటి బ్యాంకింగ్ వ్యవస్థలో ఉద్యోగ అవకాశాలు- వాటిని ఎలా అందిపుచ్చుకోవాలి' అనే అంశంపై ఇంజనీరింగ్ నాల్గో సంవత్సరం విద్యార్థులకు అవగాహనా సదస్సు జరిగింది. ఉపకులపతి ఆచార్య కె.రాంజీ, మచిలీపట్నం స్టేట్‌బ్యాంక్ శిక్షణా విభాగం డైరెక్టర్ ఆర్.వి.హనుమంత రావు, శిక్షణ నిపుణుడు రాంప్రకాష్, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ మురళీకృష్ణ, హెచ్‌ఆర్ మేనేజర్ వివేక్‌తేజ్, వర్శిటీ క్యాంపస్ బ్రాంచ్ మేనేజర్ మహేష్‌కుమార్ వివరించారు.

సబ్జెక్టు అంశాలపై అవగాహన-ప్రిపరేషన్ ముఖ్యం

ఐపిబిఎస్ పిఒ, ఎస్ఒ రెండు పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు ఆయా పోస్టుల ప్రత్యేకతలను కూడా గుర్తించాలి. ప్రొఫెషనల్ నాలెడ్జ్ కూడా పెంపొందించుకోవాలి. స్పెషలిస్ట్ ఆఫీసర్ల పరీక్ష మెయిన్స్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసే పోస్టుకు సంబంధించిన సబ్జెక్టుపై పరీక్ష ఉంటుంది. ఉదాహరణకు అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ పరీక్షకు క్రాప్‌సైన్స్, సాయిల్ సైన్స్, హార్టికల్చర్, అగ్రి ఎకనామిక్స్, యానిమల్ హస్బెండరీ వీటిని బాగా చదవాలి. కమర్షియల్, బిజినెస్, లోన్స్, గోల్డ్ ఇలా పలు అంశాలకు సంబంధించిన విషయాలపైన ప్రత్యేకంగా కేంద్రీకరించాలి. పిఒ, ఎస్ఒ రెండిటికీ అర్హత ఉన్న వాళ్లు సన్నద్ధతను కలిపే కొనసాగించాలి. ప్రిలిమ్స్ పరీక్ష కోసం రెండింటికీ ఒకటే సన్నద్ధత సరిపోతుంది. కింది సూచనలను పాటిస్తే పరీక్షకు బాగా సన్నద్ధం కావొచ్చు.

ప్రణాళికాబద్ధమైన కృషి : సిలబస్ బాగా అర్థం చేసుకోవడం ద్వారా ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో ఉన్న ఉమ్మడి విభాగాలు చూసుకోవాలి. పిఒ,ఎస్ఒ రెండింటిలో ఉన్న ఉమ్మడి విభాగాలు చూసుకుని వాటిలో ఏ టాపిక్స్ నుంచి ప్రశ్నలు తరచుగా వస్తున్నాయో తెలుసుకోవాలి.

సన్నద్ధత : రోజుకు ఎన్ని గంటలు కేటాయించగలరో నిర్ణయించుకుని, ఆ వ్యవధిని వివిధ విభాగాల సన్నద్ధత కోసం విభజించుకోవాలి. ప్రతీరోజూ ఏ విభాగాల్లో ఏ టాపిక్స్ పూర్తిచేయ దలుచుకున్నారో రాసుకోవాలి. ఇదేవిధంగా వారానికి టైమ్ టేబుల్ తయారుచేసుకోవాలి. దాని ప్రకారమే సన్నద్ధత ఉండేలా చూసుకోవాలి. స్టడీ టైమ్‌టేబుల్‌ను రూపొందించుకుని నిరంతరం దానిని అమలు చేస్తుండాలి. మన రోజువారీ పనులను ఈ టైమ్‌టేబుల్‌కు అనుగుణంగా సన్నద్ధం చేసుకోవాలి.



సబ్జెక్టు అంశాలపై సమగ్ర అవగాహన : బేసిక్ కాన్సెప్ట్‌లపై పట్టు పెంచుకోవాలి. ఇవేకాకుండా ఆప్టిట్యూడ్, రీజనింగ్ అంశాల్లో గట్టి పట్టు పెంచుకోవాలి. కాన్సెప్ట అంశాలను నిరంతరం బాగా అర్థం చేసుకుంటూ చదువుకుంటూ వెళ్లాలి. ఆంగ్ల వ్యాకరణంపై అవగాహన అవసరం. ఇది నిరంతర పక్రియగా కొనసాగాలి.

సాధనతో పరీక్షలు రాయాలి : సాధన బాగా కొనసాగడానికి, నేర్చుకోవడానికీ సరైన స్టడీ మెటీరియల్ సేకరించుకోవాలి. పరీక్షలో వివిధ విభాగాల్లో ఎక్కువ ప్రశ్నలు వచ్చే టాపిక్స్‌ను గుర్తించి వాటిని ముందుగా పూర్తిచేయాలి. సరైన స్టడీప్లాన్‌తో రోజూ సాధన చేస్తూ శ్రమిస్తే తప్పనిసరిగా విజయం సాధించొచ్చు. ఇప్పుడు ఎస్‌బీఐ పీవో వంటి ఇతర నోటిఫికేషన్లు ఉన్నాయి. వీటన్నింటికీ ఈ సన్నద్ధత ఉపయోగపడుతుంది.

టాపిక్స్ పూర్తవగానే వాటిలో వివిధ తరహా ప్రశ్నలు సాధన చేయాలి. ఆ తర్వాత టాపిక్‌ల వారీ టెస్టులు రాయాలి. వారానికి ఒకటి లేదా రెండు ఫుల్‌లెంగ్త్ మాక్‌టెస్టులు రాయాలి. అప్పుడే ఎంత సమయంలో ప్రశ్నలు సాధంచగలుగుతున్నారో తెలుస్తుంది. బలంగా, బలహీనంగా ఉన్న టాపిక్స్ ఏమిటో కూడా తెలుస్తుంది. వాటిని సరిదిద్దుకునేలా సన్నద్ధత కొనసాగించాలి. త్వరగా సాధించడానికి వీలైనన్ని ట్రిక్స్, షార్ట్‌కట్స్ కూడా ఉపయోగించటం మేలు.

పాయింట్ల వారీగా : ప్రతీరోజూ పునశ్చరణ కోసం కొంత సమయం కేటాయించాలి. టాపిక్‌లను పాయింట్ల వారీగా నోట్ చేసుకుంటే పునశ్చరణ తేలికవుతుంది. గతంలో చదివింది గుర్తుకు రావటానికి అవకాశం ఉంటుంది.

ఎలా ప్రిపేర్ కావాలంటే...

ప్రిలిమ్స్ :

- ఆప్టిట్యూడ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్
- సింప్లిఫికేషన్స్- అప్రాక్సియేషన్స్
- నంబర్ సిరీస్- క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్
- అర్థమెటిక్ టాపిక్స్- పర్సంటేజ్
- ఏవరేజెస్- ప్రాబ్లమ్స్ ఆన్ ఏజెస్
- రేషియో, ప్రాఫిట్-లాస్- టైమ్-డిస్టెన్స్
- మిక్సర్- అలిగేషన్ మెన్సురేషన్

మెయిన్స్

- హైలెవెల్ డేటా ఇంటర్ ప్రెటేషన్- మిస్సింగ్ డిఐ
- మిక్స్‌డ్ గ్రాఫ్‌లు- కేస్‌లెట్స్
- పర్ముటేషన్- కాంబినేషన్
- ప్రాబబిలిటీ- డేటా సఫిషియన్సీ
- రీజనింగ్- సీటింగ్ అరేంజ్‌మెంట్స్
- పజిల్స్
- లీనియర్ సర్క్యులర్ సీటింగ్‌బాక్స్ పజిల్
- ఫ్లోర్ పజిల్- డ్యూయల్ అండ్ కాంప్లెక్స్ పజిల్స్
- కోడింగ్-డీకోడింగ్ - డైరెక్షన్ సెన్స్
- సిలాగిజమ్- బ్లడ్ రిలేషన్స్
- ఇనీక్వాలిటీ - ఆర్డర్ అండ్ ర్యాంకింగ్
- ఆల్ఫాన్యూమరిక్- సిరీస్
- ఇన్‌పుట్ -అవుట్‌పుట్ (మోడరేట్ నుంచి హైలెవెల్)
- కోటెడ్ ఇన్ ఈక్వాలిటీ, డేటా సఫిషియన్సీ
- లాజికల్ రీజనింగ్‌లోని కాజ్-ఎఫెక్ట్స్
- స్టేట్‌మెంట్- కన్‌క్లూజన్స్
- అసెమ్షన్స్ కోర్సెస్ ఆఫ్ యాక్షన్స్
- ఇంగ్లీష్ లాంగ్వేజ్ - రీడింగ్ కాంప్రహెన్షన్
- సిననిమ్స్- యాంటనిమ్స్
- వ్యాకరణ సంబంధిత ప్రశ్నలు- క్లోజ్‌టెస్ట్
- పారాజంబల్స్- ఎర్రర్ డిటెక్షన్
- ఫిల్లింగ్ ది బ్లాంక్స్- సెంటెన్స్ కరెక్షన్స్
- సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్- వర్డ్ యూసేజ్
- మెయిన్స్ పరీక్షలో
- డిస్క్రిప్టివ్ ఇంగ్లీష్ కోసం లెటర్ రైటింగ్

(ఫార్మల్ అండ్ ఇన్‌ఫార్మల్), ఎస్సే రైటింగ్ (బ్యాంకింగ్, ఎకనామిక్, సోషల్ ఇష్యూస్)

దరఖాస్తులు ఇలా చేయాలి.

మొత్తం పోస్టుల సంఖ్య పిఒ 5208 ఎస్ఒ 1007

విద్యార్హత ఏదైనా డిగ్రీ (ఎస్ఒ పోస్టును బట్టి అర్హత మారుతుంటుంది)

(21-7-2025 నాటికి) జనరల్‌కు 20 నుంచి 30 సంవత్సరాలు

దరఖాస్తు ఫీజు జనరల్‌కు రూ.850


రూ.175 (ఎస్సీ, ఎస్టీ, విభిన్నప్రతిభావంతులు)

చివరితేదీ : 21-7-2025

పరీక్ష తేదీ : ప్రిలిమ్స్ : ఆగస్టు

వెబ్‌సైట్ : https://www.ibps.in/






"రాసిందంతా సాహిత్యం కాదు. అందమైన భాషలో సత్యాన్ని వ్యక్తీకరిస్తూ మనస్సు మీద ప్రభావాన్ని కలిగించేది మాత్రమే సాహిత్యం."
- ప్రేమ్‌చంద్

నవ సమాజానికి ఆయుధం లాంటి కవిత్వం!

ప్రముఖ కవి లోసారి సుధాకర్ 'ఆయుధం లాంటి మనిషి' పేరిట ఇటీవల కవిత్వం కవిత్వలోకానికిచ్చారు. కవిత్వలోకంలో లబ్ధప్రతిష్టులైన దర్భ శయనం శ్రీనివాసాచార్య, పలమనేరు బాలాజీ ముందుమాటలు రాశారు. ఈ కవితా సంపుటిలోని ప్రతి కవితలో వైవిధ్యమైన వస్తువు, భిన్నమైన శిల్పం, హృదయాన్ని హత్తుకునే భావుకత, ఎత్తుగడలు ఉంటాయి. ఏ కవిత చదివినా మస్తిష్కంలో దృశ్యం ఆవిష్కృతమౌతుంది, భావచిత్రం మనోఫలకలపై ముద్రించబడుతుంది. మైనపు బొమ్మలు, తడియారని స్వప్నం, నా రహస్య మందిరంలో... కవిత్వ సంపుటాలను గతంలో అందించిన లోసారి సుధాకర్ ఈ కవిత్వం మరింత ఆసక్తిని రేకేత్తిస్తుందని సగటు కవిత్వ పాఠకులు వొక అంచనాతోనే వుంటారు.

అసలు లోసారి సుధాకర్ కవిత్వ ప్రయాణం ఎలాంటిది? ఎలా సాగుతుంది? అని క్షుణ్ణంగా ప్రస్తావించవలసి వుంది. వృత్తిరీత్యా నిరంతరం వత్తిడి, బిజిబిజీగా సాగుతున్న ఉన్నతమైన ఉద్యోగ జీవితం. ఈ క్రమంలోనే చేస్తున్న అతడికి తన వృత్తి గొప్ప కవితా వస్తువుల్ని అందిస్తుందని పిస్తుంది. కవుల కవిత్వంలో, కవి సృజనలో బ్యూటీ, ట్రాజెడీ వుంటాయి. అవన్నీ ఈస్తటిక్స్‌లో భాగమే. ఆ ఈస్తటిక్ స్పేస్ తెలుసుకోవాలంటే కాస్త లోతుల్లోకి వెళ్లాల్సిందే. మరి అటువంటి ఈస్తటిక్ స్పేస్ ప్రయాణముంటుందా? లోసారి సుధాకర్ కవిత్వమంతా అలానే ప్రవహిస్తాడా? తన కవిత్వ దృక్పథం, తాత్వికత తన కవిత్వ ప్రయాణంలో ఎలా సాగుతుంది అన్నప్పుడు అనేక జవాబులు ఈ ఆయుధం లాంటి మనిషిలో దర్శనమిస్తాయి. కవిత్వంలో సౌందర్యం, విషాదం, దు:ఖం కనబడ్డప్పుడు సౌందర్య శాస్త్రం ప్రకారం మార్క్స్ యకోణం ఆవిష్కరించబడుతుందంటారు. అందుకే లోసారి సుధాకర్ కవిత్వాన్ని భిన్నమైన కోణాల్లో చూడాలి. వొక విప్లవకారుడు, ఒక దళితవాది, వొక స్త్రీవాది వెరసి మానవతావాదిగా తన కవిత్వంలో దర్శనమిస్తారు. నరనరాల్లో ప్రగతిశీలత నెత్తురులో సమ్మిళితమై ప్రవహిస్తుంటుంది. కవిత్వమే ఆయన చేత రాయిస్తుందేమో అన్నంత గాఢంగా రాస్తారు. అసలు ఈ కవిని ఎలా అంచనా వేయాలి. అసలీయన స్పష్టమైన దృక్పథం ఏమిటి అనే సంకోచం వచ్చినప్పుడు ఆయన కవిత్వం మనకు అనేకానేక ఉదాహరణలందిస్తుంది. ఈ కవితా సంపుటికి శీర్షికగా ఉన్న ఆయుధం లాంటి మనిషి కవితను చూద్దాం.

ఏదైతేనేం! నువ్వో చిన్న కూలీవి
నేనో పెద్ద కూలీని
నీ కష్టం తీర్చగా లేను
నీ కన్నీళ్లు తుడవనూ లేను
ఎన్ని మెట్లు ఎక్కితేనేం!
పైనున్నవాడు నీ వాడు కానప్పుడు
నీ మీద దయలేనప్పుడు
ఎంతముందు కూర్చుంటేనేం
ఫంక్తిలో వడ్డించేవాడు నీ వాడు
కానప్పుడు ...



పుస్తకం

ముల్లు గుచ్చుకున్నవాడికే ఆ బాధేంటో తెలుస్తుంది. ఆ బాధ తెలిసిన వాడే రాయగలడు. అడుగడుగునా అవమానాలకు, అణచి వేతకు గురవుతున్న జాతికి ఆయన కవిత ఆయుధం లాంటి మనిషయ్యింది. వర్తమాన సమాజంలోనూ ఏ స్థాయిలో ఉన్నా, ఏ స్థితిలో ఉన్నా అవమానాలు, అణచివేత ఇప్పటికీ తప్పలేదు. అందుకే తను ఆయుధంలాగే ఉండాలనుకుంటున్నాడు. ఈ కవిత అసమానతల సమాజానికి, నిచ్చెనమెట్ల వ్యవస్థకు, కింది కులాలు ఎదుర్కొంటున్న వివక్షకు అద్దం పడుతుంది. ఈ వ్యవస్థ మారడానికి అహర్నిశలూ కృషి చేసిన బాబా సాహెబ్ అంబేద్కర్ దృక్పథం ఈ కవితలో వినబడుతుంది. ఈ కవిత చివరలో ...

నీ చూపుడు వేలు దిశగా
నడవమన్నట్టుంటుంది
దిశానిర్దేశం చేసినట్టుంటుంది
ఔను నిజం మేమన్నది నిజం
నువ్వే మా మార్గం నువ్వే మా ఆదర్శం
ఓ స్వాప్నికుడా,
ఓ దార్శనికుడా నువ్వున్నందుకే మేమున్నాం
నువ్వు చూపిన దారిలో
ఇంకాస్త మరికాస్త స్థిరంగా ముందుకు
అడుగులు వేస్తూ

ముమ్ముందుకే నడుస్తూ... అంటూ ఇలా ఆ చూపుడువేలు ప్రకాశిస్తున్న వెలుగుదారుల్లో లక్షరాలను నడిపిస్తారు లోసారి సుధాకర్. ఎనభై, తొంభై దశకాల్లో వచ్చిన అభ్యుదయ, విప్లవ కవిత్వాన్ని విస్తృతంగా చదివిన సుధాకర్ 1982లో 'మంటలు' అనే కవిత రాశారు. అది ఆంధ్రప్రభలో ప్రచురితమైంది. ఆ తరువాత కవిత్వం అంతా అనేక సామాజిక అంశాలను స్పృశిస్తూ సాగుతోంది. ఇదే సంపుటిలోని 'మరఫిరంగి' కవిత ఇలా సాగింది.

ఇంకెన్నేళ్లు మోస్తాం?
ఇంకెంతకాలం గుక్క బట్టి ఏడుస్తాం?
ఇంకెంతకాలం చస్తూ బతుకుతాం?
ఏళ్ల తరబడి ఇలా బతుకులు తగలబడి
స్వరం లేక నరం లేక నెత్తురు లేక సత్తువ లేక
ముందు శత్రువు వెనక శత్రువు
ఎదురుపడిన శత్రువు ఎదురుపడని శత్రువు
ఆయుధాలతో శత్రువు అధికార బలంతో శత్రువు
ఎక్కడ చూసినా అక్కడ అణగదొక్కటమేనా
అలసిపోయేదాకా సొమ్మసిల్లి
నేలవాలిపోయేదాకా..

కులమతాలు, ఆర్థిక వ్యత్యాసాలు, సంపన్నులు- సామాన్యులు, మతోన్మాదం .. ఇవి వర్తమాన సమాజంలో నేడు మనకు ఎదురవుతున్న సవాళ్లు. సమాజం ఎలా వుందో ఈ వివస్త్ర భారతం శీర్షికతో ఉన్న కవిత చూడండి.

ఇంకా చెప్పుకోడానికేముంది/ దేశం గురించి/ దేహపటం గురించి/ గత వైభవం గురించి/ ఘనకీర్తి గురించి/ ధర్మాల గురించి/ దైవాల గురించి/ వేదాల గురించి/ మనువాదాల గురించి/ పుక్కిట పురాణాల గురించి/ పుచ్చు పట్టిన వ్యవస్థ గురించి/ వీధుల్లో విశ్వ వేదికల్లో/ ఒట్టిమాటలు నంగికూతలు/ దొంగ వేదంతాలు వల్లివేయటం తప్ప/ నిత్యం సత్యం'వధ' చర్మం 'చెర'/ నిజం పలికితే/ నాలుకలు నేలమీద తెగిపడతాయి/ మానాలు మంట కలిసి పోతాయి/ హక్కులను అడిగినా/ అన్యాయాల్ని వేలెత్తి చూపినా/

అమ్మతనాన్ని ఆడతనాన్ని వీధుల్లో ఊరేగిస్తారు/ సిగ్గు పడదానికేముంది/ శీలం శిలువేశాక/ మానం వేలంవేశాక/ కన్నీళ్లు కార్చిన కాళ్లు కడిగిన/ జాతీయగీతాలు పాడిన/ జాతీయ పతాకాలు ఒంటికి కప్పిన/

దేశ వివస్త్రమై మిగిలాక/ ఇంకా ఏం మిగిలింది దాచుకోడానికి/ ఇంకా ఏం మిగిలింది చెప్పుకోడానికి/ ఒక ఆదిమ సంస్కారం ఒక బరితెగించి/ అంబోతై బలహీనులను కుమ్ముతుంటే/ దండనాధికారం చేష్టలుడిగి కూర్చుంటే/ ఇంకా చెప్పుకోడాని కేముంది/ కన్న భారతి కౌరవసభలో/ ద్రౌపదిగా నిలబడ్డాక/ దేశం ఇప్పుడు ఒక ధృతరాష్ట్రం ...

ఈ వొక్క కవిత చాలు కవి దృక్పథాన్ని అంచనా వేయడానికి.. ఈ కవితొక్కటి చాలు కవి ఎవరి పక్షాన నిల్చుని ఆయుధం ధరించాడో చెప్పటానికి. ఈ వొక్క కవిత చాలు ఈ కవి.. దేశం ఎలా వుండాలని కోరుకుంటున్నాడో తెలియటానికి. ఆ రాజదర్బారు ఈ కొరత అనే శీర్షికతో ఉన్న కవితలో చూద్దాం.

అక్కడ ఒక రాజ దర్బారు నడుస్తుంది/ తలలేని రాజు కిరీటం మాత్రమే/ ధరించి తీర్పులు చెబుతున్నాడు/ తీర్పులు తీర్పులు కావు ఏకపక్ష నిర్ణయాలు/ నిర్ణయాలు నిర్ణయాలు కావు/ శిలాశాసనాలు/ శాసనాలు/ అన్యాయపు ప్రతీకలు/ కళలు ఉండరాదు/ కళాకారులు ఉండకూడదు/ కవులసలే ఉండరాదు'/ అక్కడ ప్రజలందరూ బధిరులు/ అక్కడ ప్రజలందరూ అంధులు/ వాళ్లంతా చేతులు మాత్రమే ఉన్న ప్రజలు/ చేతులు నమస్కరించడానికి మాత్రమే/ ఉన్నాయనే ప్రజలు/ చేతులు రాజసేవకే/ ఉన్నాయని నమ్మే ప్రజలు/ రాజ్యం జనం కోసం/ మాకు జనరాజ్యం కావాలన్నందుకు/ 'కవిగాడికి కొఱత వేయండని' ఆజ్ఞ/ ఉరిబడ్డ గొంతు శంఖమై మోగింది/ తిరగబడ్డ పాదం/ కదం తొక్కింది/ ఆ సాయంత్రం/ అక్కడ ఒక నగరం తగలబడుతోంది/ తలలేని కిరీటంతో పాటు..

ఈ కవిత చదువుంటే వర్తమాన దేశ రాజకీయ ముఖచిత్రం కనబడుతుంది. ప్రతి అక్షరం పాలకుల వైఖరికి అద్దం పడుతుంది. ఈ కవిత్వం చదువుతున్నంత సేపూ మనల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తూ ఊపిరి సలుపనంతగా చుట్టుముడుతుంది.

మనిషి తలకిందులుగా మొలచినట్టు
ఒకానొక అపసవ్యత్వం
ఎంత వేగము ఎంత దూరము
పదునెక్కిన ఆయుధం కదా జీవితం
చూపు చుక్కానిగా దారి చూపాల్సిన చోట
చివరాఖరు కోరికలా ఆ చూపేమిటి?
కాలం ఏదైతేనేమీ
ప్రాంతం ఇంకేదయితేనేమి
న్యాయం బలిపీఠంపై వితర్ధి
అవమానం అలవాటు పడిన చరిత్ర
తరాలుగా ఇదే కథ తరతరాలుగా ఒక్కటే కథ!

ఇలాంటి వాక్యాల్లో పదునైన భావం ఈ సంపుటి నిండా కనిపిస్తుంది. ఆయుధంలాంటి మనిషి కవిత్వం ఇటీవల వచ్చిన గొప్ప కవిత్వంగా చెప్పవచ్చు. నవ సమాజ నిర్మాణ కావలసిన పనిముట్లన్నీ ఈ కవిత్వంలో లభిస్తాయి. లోసారి సుధాకర్ నుంచి భవిష్యత్తులో మరింత గొప్ప కవిత్వాన్ని మనం ఆశించవచ్చు.

– కెంగార మోహన్
94933 75447

విశ్వంతో మౌన సంభాషణ 'శూన్యం'

మనసుతో, మాటతో, మనసులో మాటతో ఓ నిజాన్ని ఆరాధించి, అక్షరంలో ప్రతిష్ఠించి ఓ ఆలోచన రగిలించి సాహిత్యాన్ని శాస్త్రీయంగా, శాస్త్రీయతను సాహిత్యంలో చిత్ర, విచిత్రంగా విస్మయం కలిగేలా కవిత్వం చెప్పగలిగిన ప్రతిభ కలిగి ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ఓ కొత్త కోణంలో నడిపించాలన్న ఆత్మవిశ్వాసం గల యువకవి ఫిజిక్స్ అరుణ్ కుమార్. వృత్తి రీత్యా ఫిజిక్స్ బోధిస్తున్నా మనసు రీత్యా పుట్టే ఆలోచనలన్నీ విశ్వంలోని గొప్పదైన సత్యాల వైపు పయనించే మార్గంలో ఎదురైన పలు రంగాల్లో గొప్పవారి ఆలోచనలనుఆలోచించడంలో కలిగిన తన సొంత భావాలను కవితలరూపంలో రాయడం అలవాటుగా మార్చుకున్నాడు. తన కంటి ముందు కనిపించిన ప్రతి సమస్య లోతుకెళ్లి దాని వెనుకున్న చరిత్రను వెదకడంలో విజయం సాధించాడు. ఆ కవితలన్నింటి సమాహారమే 'శూన్యం' కవితా సంపుటి.



పుస్తకం

ఈ పుస్తకాన్ని మన దేశంలో నోబెల్ బహుమతి పొందిన రవీంద్రనాథ్ ఠాగూర్, సి.వి. రామన్ లకు అంకితం ఇవ్వడంలోనే అర్థం చేసుకోవచ్చు ఆ ఇద్దరి ప్రభావం కవి మనసుపై ఎంతగా ఉందో! భిన్న రంగాలుగా కనిపించే వీరి సిద్ధాంతాలను, ఆలోచనలన్నీ రెండిటినీ కలబోసిన ఓ కొత్త ఆలోచనతో ముందుకు నడచిన అరుణ్ కుమార్ పయనం ప్రశంసనీయం. అలాగే ప్రపంచాన్ని అర్థం చేసుకోవలసిన పలు ముఖ్యమైన రంగాల ప్రముఖుల జీవిత చరిత్రలను చదివిన మూలంగా కుల, మత, వర్గ ,ప్రాంత రహితంగా మానవ జీవితంలో ముఖ్యమైన అంశాలపై పట్టు సాధించాలన్న లక్ష్యం ఈయన కవితల్లో కనిపిస్తుంది. మనిషి జీవితంలో మనసు ప్రాధాన్యతను తెలిపే ప్రతి సున్నితమైన విషయంలోనూ జ్ఞానం, విజ్ఞానం పట్ల అవగాహన రావడం ఈ కవితల్లో గమనించవచ్చు.

తను తొలిగా రాసిన 58 కవితల్లో చాలా వరకు ఓ తాత్వికత, హేతుబద్ధతతో చూడవచ్చు. కొన్ని విలువల్ని ఎత్తి చూపుతూ రాబోయే తరాలకు బోధించే దిశగా సాగాయి. మనిషి జీవితంలో బాల్యం గొప్ప విలువైన జ్ఞాపకం, తరగని ఆస్తి లాంటిది. 'అసూయ, కోపం, స్వార్థం లేని పసిప్రాయం ఎంత బాగుందో..../ మళ్ళీ మళ్ళీ రాని బాల్యం ఎంత బాగుందో... నా మనసేమో మళ్ళీ ఓ సారి రమ్మంటోంది".... అన్న వాక్యాల్లో అనుభవం సుమారుగా ప్రతి వారిని తాకుతాయి

ఏదైనా కొత్త విషయాన్ని మనం గురువు నుండి తెలుసుకుంటాం. అలాగే గురుబలం కలిగిన ఎన్నో విషయాల నుంచి ఎంతో నేర్చుకుంటాం. అదే విషయాన్ని 'అయస్కాంత దిక్సూచి' కవితలో చూస్తాము. ఆధునిక సమాజపు ఆత్మగా అజ్ఞానపు అంధకారాన్ని తరిమే అర్హత గల ఆశయాల వారధిలో నిజాయితీకి నిర్వచనం గురువు... తనకు తాను ప్రకాశించే ఫిజిక్స్ గురువు.. మానవీయత మరో గురువు.. అదే విధంగా జీవితం గురించే ఓ కవితలో 'పారిపోవడం, చనిపోవడం కాదు.. మళ్ళీ మళ్ళీ ప్రయత్నం చేయి... ఈ ప్రపంచాన్ని పట్టించుకోవద్దు. భవిష్యత్ తరాలకు నీవే భానుడవు...' అని చెప్పడంలో గొప్ప సానుకూల దృక్పథం కనిపిస్తుంది.

శ్రీశ్రీ గురించి రాస్తూ, "శ్రీశ్రీ రెండక్షరాల శిఖరం.... సూర్య చంద్రుల సంగమం... అలంకార, ఆధిపత్య మధ్య బందీగా ఉన్న తెలుగు వెలుగుని సామాన్యుల జీవనంలో జీవంగా మారిన అక్షర రాకెట్"... అని సింపుల్‌గా గొప్ప సత్యాన్ని చాటాడు. 'మన రాజ్యాంగపుగుండె శబ్దం....' కవితలో గౌతమ బుద్ధుడు, గాంధీ మహాత్ముడు నా దేశ వారసత్వం/ రామేశ్వరం వీధుల సాక్షిగా కలాం మీకు సలాం....' అంటారు. ఈ వాక్యాల్లో దేశం కనిపిస్తుంది. తెలుగు వెలుగు కవితలో భాష గొప్పదనాన్ని చెప్పు సందర్భంలో 'పోటీ ఏదైనా తెలుగు భావాన్ని గెలిపిద్దాం' అనే వాక్యం వెనుక భాష బతికితేనే భావం బతుకుతుంది అనే అర్థం దాగుంది.

దేశానికి వెన్నుముక రైతు పక్షాన ఓ పౌరుడిగా బాధ్యత వహించే పర్వంలో నేను సైతం అనే పదాన్ని కవితా శీర్షికతో రైతుదేవోభవ అనే కొత్త నినాదాన్ని అందించి రైతు జీవితాలని, కష్టాలని ఆలోచించే విధంగా ఈ కవిత సాగింది.

ఫిజిక్స్ పరిభాషలో కొన్ని పదాలను వాడి కవిత్వాన్ని కొత్త అందంలో మనసులో ముద్ర పడేలా చేయడం బాగుంది. నిశ్శబ్దంగా మండటం నేర్చుకో, నా గుండె లోలకమై, విప్లవ క్షిపణుల వికిరణాలు లాంటి శీర్షికలు ఆకర్షణీయంగా ఉన్నాయి. శూన్యమే సత్యం, అనంతం దాని నైజం... అంటూ తన సాపేక్ష సిద్ధాంతంలో ఫిజిక్స్‌లో ఫిలాసఫీ, ఫిలాసఫీలో పోయెట్రీ అంటూ ఓ కొత్త ఆలోచన పుట్టించడం ఈ కవితా సంపుటి ప్రత్యేకత. ఈ పుస్తకానికి పేరుకి అర్హత సాధించిన కవిత శూన్యం. ఈ కవితలో "బతకడం కోసం రాసినవి కొన్ని.. బతుకంటే ఏమిటో చెపుతూ రాసినవి కొన్ని... చచ్చాక బతికుండేలా రాసినవి కొన్ని... ఎప్పటికీ చావులేని రాతలు కొన్ని..." అంటూనే జీవితంలో మిస్టరీ, లిటరేచర్, జ్ఞానం, అజ్ఞానం, ప్రశ్న, జవాబు, ఆలోచన, అన్వేషణ, స్వప్నం, సత్యం నేపథ్యంగా సంపూర్ణ కవిత్వాన్ని, ఆ పరిమళాన్ని పాఠకులకు పంచాలని తపన కనిపిస్తుంది. మనిషి నాశనం చేస్తున్న ప్రకృతిని, రాబోయే కాలంలో భూమిని, మనిషిని అక్షరాలతో అంచనా వేసి నేటి మనిషిని హెచ్చరిస్తూ గ్లోబల్ వార్మింగ్, బ్లాక్ హోల్ కవితలో తన భావాలను వెల్లడించారు.

ఈ విధంగా పోతుల అరుణ్ కుమార్ ఫిజిక్స్ అరుణ్ కుమార్‌గా మార్పు వెనుక గల బలమైన ఆసక్తిని, ఇంకో వైపు తనకున్న సాహిత్యాభిరుచిని చాటుకోవడంలో ఓ శాస్త్రీయతను పాటిస్తూ అక్షరంలో కలసి వేసిన ప్రథమ అడుగు ప్రశంసనీయం. ఓ సమస్యను ఎత్తి చూపుతూ, ఓ ప్రశ్నను పాఠకుల మదిలో నాటి సాగించిన ఈ సాహితీ సేవ ఓ విలక్షణతకి అద్దం పట్టింది.

– చందలూరి నారాయణరావు
97044 37247

కార్టూనిస్ట్ శేఖర్ స్మారక అవార్డుల ప్రదానం 13న

కార్టూనిస్ట్ శేఖర్ స్మారకార్థం ప్రతి సంవత్సరం ఇస్తున్న అవార్డుల ప్రదానం ఈ నెల 13న (ఆదివారం) ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరగనుంది. 2025 సంవత్సరానికి గాను కార్టూనిస్ట్ మత్యుంజయ, ఆర్టిస్ట్ చిత్ర అవార్డులను అందుకోనున్నారు. ఈ అవార్డు కింద 10,116 నగదు, ప్రశంసాపత్రం ఇవ్వనున్నారు. ఈ ప్రదానోత్సవ సభకు ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్.వినయకుమార్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. A Brush Against Prejudice: The Pro-people Art of Sekhar అనే అంశంపై సీనియర్ జర్నలిస్ట్ కూర్మనాథ్ శేఖర్ స్మారకోపన్యాసం చేస్తారు. విశిష్ట అతిథులుగా డాక్టర్ తిప్పర్తి యాదయ్య, చింతల యాదగిరి, శంకర్, కూరెళ్ళ శ్రీనివాస్, శ్రీమతి చంద్రకళా శేఖర్ పాల్గొంటారు.

– శేఖర్ కుటుంబ సభ్యులు

చరిత్ర, ఆర్ట్, కథ, కవిత్వ రంగాల్లో పురస్కారాలు

విశాలాక్షి సాహిత్య మాస పత్రిక ప్రతి ఏడాదిలా 2025కు చరిత్ర, ఆర్ట్, కథ, కవిత, పాత్రికేయ రంగాల్లో సంపుటాలను ఎంపిక చేసింది. న్యాయం నిర్ణేతల ఎంపిక ప్రకారం... చరిత్ర విభాగంలో డాక్టర్ జివి పూర్ణచంద్ (భువన విజయం), ఆర్ట్ రంగంలో ఆత్మకూరు రామకృష్ణ, పాత్రికేయ రంగంలో రాయసం దామోదర్ (పాత్రికేయ వ్యాసాలు), కవిత్వంలో సంధ్యాశర్మ (సంధ్యా సమీరాలు), కథల విభాగంలో మేడ మస్తాన్ రెడ్డి (స్పర్శ), వడలి రాధాకృష్ణ (గ్రీన్ లైట్ ఏరియా), ఏరువా శ్రీనాథరెడ్డి (డబ్బు అమ్మబడును)లను ఎంపిక చేశారు. జులై 20వ తేదీ నెల్లూరు టౌన్‌హాల్లో జరిగే విశాలాక్షి వార్షికోత్సవ సభలో వీరిని నగదు బహుమతితో పాటు సన్మానించటం జరుగుతుంది.

– ఈతకోట సుబ్బారావు

పెన్నా రచయితల సంఘం కవితా పురస్కారాలు

2023- 24కి గానూ పెన్నా రచయితల సంఘం ప్రకటించిన కవితా సంపుటిల పోటీలో విజయనగరం జిల్లా మెంటాడ గ్రామానికి చెందిన పాయల మురళీకృష్ణ రచించిన కవితా సంపుటి గచ్చెం సెట్టుకి; జగ్గంపేట కాకినాడ జిల్లా వాసి మిరప మహేష్ రచించిన కవితా సంపుటి పడమ టీది నాటకంకి లభించినట్లు పెన్నా రచయితల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రా దేవి తెలిపారు. వారికి జూలై 12వ తారీఖున పురస్కారాలు అందజేస్తామని అన్నారు.


కల్లోల మేఘం

కనిపించిన వారినల్లా
కాల్చి పారెయ్యాలన్న కోపం
అపరాధులు
జైలు బయట స్వేచ్ఛాకాశంలో
నిరపరాధులు
జైలుశిక్షల దీర్ఘ కవితలు చదువుకుంటూ
బట్టలకు, చెప్పులకు, ఉత్తరాలకు
జీఎస్టీ చెల్లించే ఉత్తమ పౌరులం
మన భాష, మన తిండి, చదువు
అన్నీ ఏలికల నిర్ణయాలే
పొద్దున్నే ముఖానికి గ్లో అండ్ లవ్లీ
ఒంటి మీద బ్రాండెడ్ బట్టలు
పరీక్షల కన్నా శ్రద్ధగా ముఖ పుస్తక పఠనం
పరాయీకరణ పరాయీకరణ
అడుగు వేసినపుడల్లా
కనబడని సంకెళ్ల గరగర చప్పుళ్ళు
తాళాలు లేని చెరసాలలో ఖైదీలం
ఐఎస్ఐ మార్కు బానిసలం
చీమ పాకితే చిరాకు పడతాం
దోమ కుడితే చంపుతాం
అన్యాయాలను ప్రశ్నించలేని
పరమ విధేయ చక్రవర్తులం
అపర శాంతమూర్తులం
దేన్నీ పట్టించుకోని నిర్లిప్తతా కవచాల్లో
నీళ్ళు చల్లిన నిప్పుకణాలం
ఆత్మాభిమానం మరచిన వ్యర్థజీవులం
రొచ్చు గుంటలో పందుల్లా
మురికికాలవల్లో మశకాల్లా
మనం మనుషులమేనా?
మార్చురీలో శవాలమా



గుడ్డిదీ చెవిటిదీ మాత్రమే కాదు
గుండె లేని న్యాయ దేవత
అధికార పార్టీ నాయకుని జేబులోనో
కార్పొరేట్ కుబేరుని బ్యాంక్ లాకర్లోనో
కుదువ బెట్టందేమో
ఐనా కనబడని మనసు కోసం
పాడు చేసుకోవడమెందుకు మనసు
ఇవన్నీ ఆలోచించడానికి తీరికెక్కడ!
సాయంకాలం కాగానే
ఓ పెగ్గో, రెండు పెగ్గులో లాగించేయ్
టీవీ సీరియల్‌కో, పుష్ప 2 కో కళ్ళప్ప చెప్పేయ్
నిద్రా దుప్పటి కప్పేయ్
కలుగుల్లో ఎలుకల్లా భద్రంగా ...

– మందరపు హైమవతి
94410 62732



వికృతపు పండుగ

వాళ్ళు హత్యల ఆత్మహత్యల
తోరణాలు కట్టుకుని
టీఆర్పీల పండుగ చేసుకుంటారు

వీళ్ళు దవడలను ఆడిస్తూ
మోరల్ పోలీసింగ్‌లు
కారెక్టర్ అసాసినేషన్‌లు చేస్తూ
తీరికగా తీర్పులను
ప్రకటిస్తూ ఉంటారు!

వాళ్ళకి
వ్యూయర్స్ పెరగాలనే ఆరాటం
వీళ్ళకు ఖాళీ సమయాలను
పుకార్లతో పూరించుకోవాలనే ఉబలాటం!
ఒకసారి ఛెళ్ళుమన్న చెంప
పదేపదే తెరపై నాట్యమాడుతూ
తిన్నవాడిలో మరింత కసిని రగిలిస్తుంది!
కొట్టిన దృశ్యాన్ని
మళ్ళీ మళ్ళీ చూపిన
వాళ్ళ తుంటరితనం
పగలబడి నవ్వుకుంటుంది

మొలకెత్తిన పశ్చాత్తాపాన్ని తుంచి
పనిగట్టుకుని పగను పెంచే
వాళ్ళ పనితనం ముందు
ఎవరైనా బలాదూర్!

పడక గదుల్లోకి, పర్సనల్ స్పేస్‌లలోకి
తొంగి చూస్తూ
వాళ్ళు చేసే విన్యాసాలను చూసిన ప్రతిసారీ
మెత్తని హృదయాలలో
తెలియని వికారంతో కూడిన ఉలికిపాటు

తెరల వెనుక పొరలు పొరలుగా
విచ్చుతున్న దుఃఖపు శబ్దాలు
ఎవరికి వినబడతాయి?
వాళ్ళ చర్యల వల్ల
భూమిలోకి మరింత కుంగిపోయే బతుకులు
ఎవరికి కనబడతాయి?

నిజాలు నీడల మాటున
నిశ్శబ్దంగా దాగుంటాయి
అబద్ధాలు రెక్కలు కట్టుకుని
లోకంలో ఎగురుతూ
పగిలిన హృదయాలలో
మరింత మంటలు రాజేస్తుంటాయి!

– పద్మావతి రాంభక్త
99663 07777



రాత మారాలంటే ...

ఉద్యాన వనాల్లో
వసంత గిలిగింతల్లో సాగే
నా నిద్రను ఎవరు? ఎవరు?
శ్మశానాల్లోకి ఈడ్చుకుపోతున్నారు
అవేవో దెయ్యాలు భూతల్లా ఉన్నాయి
నా మెదడను శూలాలతో ...
అవును శూలలతోనే ముక్కలు చేసి
కులాల్లో కొన్నిటినీ, మతాల్లో ఇంకొన్నిటినీ
ఊరేసి ఆరేస్తున్నాయి!
ఆ మెదడు ఎక్కడుందో తెలీక
శరీరాన్ని పొడిచి పొడిచి ఈడ్చేస్తున్నాయి
నన్ను నేను నా లౌకిక మంచం మీద
ఉంచుకోవడానికి
అర్థం కాని ఆయుధంతో..
అది ఆయుధమేనా?
ఆ.. ఆయుధమే...
దాన్ని చేబూనే పోరాడుతున్నా
పోరాడుతూ పోరాడుతూ
ఆయుధం జారిందనే భయంతో
ఉలిక్కిపడి లేచి కూర్చున్నా ...
కల .. జీవితంలో రేగిన
ఎన్నో కలతల .. అల

ఆమె రోజు కూలీ, నాది కాంట్రాక్ట్ పని
ఇద్దరి సంపాదనలూ కలిపినా
ఉన్న ఒక్క పిల్లనీ పెంచడానికి
లాగితే పీకితే చిరిగి పోతూనే ఉంది
ఇంటి పన్నులు యజమానిని తంతే
ఆ గాయం మా అద్దె గుండెకు తగిలింది!
స్కూలు ఫీజూ అందుకే మమ్ము పొడిచింది
ఎవడి మోసం వల్లో చమురు మండితే
అది మా అల్మారాకు చేరాల్సిన
సరుకుల ధరలు పొంగించింది
ఎప్పుడో ఎందుకో ఎవడి వల్లో తెలీదు కానీ
గత నష్టాలు చూపి కరెంటు బిల్లు షాకిచ్చింది
ఇలా మూరెడు ఆదాయంపై
బారెడు భారాలు సలుపుతున్నాయి

సగటు జీవుల కష్టాలపై చర్చేది?
నిద్ర లేస్తే కుల గీతాల భక్తి
కాకుంటే మతం ఉన్మాదమైన రాగం
ఉద్రేకాల్లో నాన పెడుతుంది
పాలకులేమో యోగాలు చేయిస్తూ
నేతలకు గోవిందలు కొట్టిస్తున్నారు
వీటితో ఉదయాన్ని చూడాలంటే భయం
రాత్రిని కౌగలించాలంటే పీడ కలలమయం
భద్రత తప్పిన బతుకులో విషాదాలు
పరిగెడినా అందని ఉషోదయాలు

ఎక్కడో చెమట గీతాలు మోగుతున్నాయి
అయినా నా చెవుల్లో పెట్టిన దూది
ఇప్పటి వరకూ విన నీయని మాట నిజం
దూదిని కదిలించాలి ... వదిలించుకోవాలి
చెమట గీతాలను ఆలకించాలి
ఆ స్వరంలోనే నా జీవన వరం చూసుకోవాలి!

– ఉన్నం వెంకటేశ్వర్లు
87900 68814

భారతీ!

ఎక్కడమ్మా! ఎక్కడమ్మా?
భారతం వికసించుచున్నది!
బతుకు తెరువుల వెతుకులాటలో..
దుఃఖమెక్కడ చావు కానిది!
ఇటుక బట్టీ.. ఇసుక లారీ
బద్దలైన కొండ క్వారీ
కూలిపోయిన సొరంగాలు
పేలిపోయిన ఫ్యాక్టరీలు ..
వలస జీవుడి ముఖం ఏదమ్మా!
వెలిసిపోయిన రక్తమేదమ్మా?

నాగలయ్యల నడుం తొక్కి
ట్రాక్టరోళ్లు పోయినారు
ఉడుపులమ్మల బొటన వేళ్లను
ఊరిలోనే విరిచినారు!
ముసలి పేగుల కొసరి ఆశల
వలస బిడ్డల చివరి చూపులు!
ఎక్కడమ్మా!
చేపల్ల రూపాలు ఎరిగి
పేర్లు పెట్టిన పెదవులమ్మా!
సుట్టపోడికి పులుసు వండి
కడుపు నింపిన సూపులమ్మా!
సంద్రజలముల.. ఎల్లలెరుగక
బందిఖానాలెందుకమ్మా!?

సాగు భూముల .. మూగ నోముల
ఆలు బిడ్డల.. ఆలమందల
పురుగు మందుల.. పొలం గట్టుల
పచ్చదనమేదమ్మా.. తల్లీ!
పిచ్చి ప్రేమల వెచ్చదనమేదమ్మా?
కులం తెలియని పొలములమ్మా!
మతం ఎరుగని పశువులమ్మా!
కన్నె తూరుపు కన్న బిడ్డడు
చిన్ని సూర్యుడు మా మనమడమ్మా!
ఉదయమెరుగక చెదిరిపోయే
శిధిలాలలోన చివరి మాటలు
ఛిద్రమైనావే తల్లీ!
ఎక్కడమ్మా!?
భారతం వికసించుచున్నది!?

– నల్లి ధర్మారావు
76609 67313

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

'గ్లోబల్ సౌత్'కు మరింత ప్రాముఖ్యత

- బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోడీ



బ్రిక్స్ దేశాధినేతలతో గ్రూప్ ఫొటోలో ప్రధాని మోడీ

బ్రెజిల్ : రియో డి జనీరియో : వర్ధమాన, అభివృద్ధి చెందుతున్న దేశాల వేదికగా 'గ్లోబల్ సౌత్'కు ఇప్పుడు మరింత ప్రాముఖ్యత పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాల్లో భాగంగా 'శాంతి, భద్రత, ప్రపంచ పాలనలో సంస్కరణ' అనే అంశంపై ఆదివారం నాటి సెషన్‌లో మోడీ ప్రసంగించారు. గ్లోబల్ సౌత్‌లో అంతర్జాతీయ సంస్థలు తగినంత ప్రాతినిధ్యం వహించడం ప్రస్తుతం తప్పనిసరి అని, ఇది వాటి సమర్థతకు ప్రామాణికంగానూ, గుర్తుకారణంగానూ నిలుస్తుందని మోడీ తెలిపారు.

ద్వంద్వ ప్రమాణాల వల్ల గ్లోబల్ సౌత్ దేశాలు బాధితులుగా నిలిచాయని, వాటి ప్రయోజనాలకు తగిన ప్రాధాన్యత లభించలేదని మోడీ అన్నారు. వాతావరణ ఆర్థిక వ్యవస్థ, సుస్థిరాభివృద్ధి, సాంకేతిక విషయాల్లో విధివిధానాలు మినహా గ్లోబల్ సౌత్‌కు దక్కిందేమీ లేదన్నారు. మానవ సమాజంలో మూడింట రెండొంతులుగా ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలకు తమ గళాన్ని వినిపించే అవకాశాన్ని 20వ శతాబ్దిలో నెలకొల్పిన అంతర్జాతీయ సంస్థలేవీ కల్పించలేకపోయాయని మోడీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంతో భాగస్వామ్యం అందిస్తున్న దేశాలకు నిర్ణయాత్మకంగా ఉండే వేదికలపై కనీసం స్థానం కూడా లేకుండా పోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గ్లోబల్ సౌత్‌కు ప్రాతినిధ్యం లేని అంతర్జాతీయ సంస్థలు మొబైల్‌లో సిమ్ ఉన్నా..నెట్‌వర్క్ లేని దుస్థితిలో ఉంటాయని అభివర్ణించారు. ప్రస్తుత కృత్రిమ మేధ (ఎఐ) యుగంలో వారం వారం ఆధునిక సాంకేతికత అప్‌డేట్ అవుతోందని, అలాంటిది అంతర్జాతీయ సంస్థల్లో కనీసం ఎనిమిదేళ్లకు ఒక సారి కూడా మార్పులు చేర్పులు జరపకపోవడం ఆమోదయోగ్యం కాదని మోడీ అన్నారు. 21 శతాబ్ది సాఫ్ట్‌వేర్ 20వ శతాబ్ది నాటి టైప్ రైటర్లలో పని చేయబోదని ఆయన ఎద్దేవా చేశారు.

అంతకు ముందు జరిగిన సాంప్రదాయ ఫోటో సెషన్‌లో మోడీ పాల్గొన్నారు. బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాల అధ్యక్షులతో సహా ఆరు ఇతర సభ్య దేశాల నాయకులు కూడా సెషన్‌లో పాల్గొన్నారు. బ్రిక్స్ సభ్య దేశాల మధ్య ఐక్యత, సహకారానికి గుర్తుగా ఈ ఫోటో సెషన్‌ను భావిస్తారు. అలాగే దక్షిణాఫ్రికా అధ్యక్షులు రామఫోసాతో మోడీ సమావేశమయ్యారు. ఈ సదస్సును మోడీ తన ఎక్స్ వేదిక ద్వారా వెల్లడించారు. అలాగే ఆర్థిక సహకారం, ప్రపంచ శ్రేయస్సు కోసం బ్రిక్స్ క్షేమంతమైన సంస్థగా పని చేస్తుందని తెలిపారు. ఈ పాల్గొనేందుకు బ్రెజిల్ చేరుకున్న మోడీకి గలేయో అంతర్జాతీయ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. సోమవారం స్థానిక మ్యూజియం ఆఫ్ మోడరన్ ఆర్ట్‌లో జరిగే 17వ బ్రిక్స్ సమావేశంలో పాల్గొంటారు. ప్రస్తుత బ్రిక్స్ సమావేశంలో ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడి, గాజాలో మానవతా సంక్షోభం, అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ విధించిన వాణిజ్య సుంకాలు వంటి ముఖ్యమైన అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. కాగా, బ్రిక్స్ సమావేశం తరువాత బ్రెజిల్‌లో మోడీ పర్యటించనున్నారు. దీంతో 60 ఏళ్ల తరువాత బ్రెజిల్‌లో ద్వైపాక్షిక పర్యటన చేస్తున్న తొలి భారత ప్రధానిగా మోడీ నిలవనున్నారు.

బ్రిక్స్ బ్యాంక్‌లో కొలంబియా, ఉజ్బెకిస్తాన్

బ్రిక్స్ బ్యాంక్‌గా పేర్కొనే న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డిబి)లో కొలంబియా, ఉజ్బెకిస్తాన్ దేశాలు చేరాయి. ఈ విషయాన్ని ఎన్‌డిబి అధ్యక్షురాలు దిల్మా రౌసెఫ్ ప్రకటించారు. సోమవారం నుంచి బ్రిక్స్ 17వ శిఖరాగ్ర సమావేశాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఎన్‌డిబి డైరెక్టర్ల బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొలంబియా, ఉజ్బెకిస్తాన్ ప్రవేశానికి ఆమోదం తెలిపారు. దీంతో ఎన్‌డిబిలో మొత్తం సభ్య దేశాల సంఖ్య 11కు చేరుకుంది.

బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, యుఎఇ, ఈజిప్ట్, అల్జీరియా, కొలంబియా, ఉజ్బెకిస్తాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి. ఇంకా కొన్ని దేశాలను ఎన్‌డిబిలోకి తీసుకోవడానికి పరిశీలన చేస్తున్నట్లు రౌసెఫ్ తెలిపారు. దక్షిణార్థ గోళ దేశాలకు సేవలు అందించడమే బ్రిక్స్ లక్ష్యమని చెప్పారు. 2015లో ఎన్‌డిబి ప్రారంభమైనప్పుడు భారత్, చైనా, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా మాత్రమే సభ్య దేశాలుగా ఉన్నాయి. షాంఘైలో దీని ప్రధాన కార్యాలయం ఉంది. ఇప్పటి వరకూ 120 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపి, రుణాలను మంజూరు చేసింది.

భారత్‌లో రాయిటర్స్ ఎక్స్ ఖాతా బ్లాక్

న్యూఢిల్లీ: ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ అధికారిక ఎక్స్ హ్యాండిల్ భారత్‌లో నిలిచిపోయింది. లీగల్ డిమాండ్ కారణంగా ఎక్స్ ఖాతాను బ్లాక్ చేసినట్టు తెలుస్తున్నది. అయితే దీనిపై రాయిటర్స్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే లీగల్ డిమాండ్ కారణంగా భారతదేశంలో విత్‌హెల్డ్‌లో పెట్టినట్టు పేర్కొంటూ ఎక్స్ హాండిల్‌లో కనిపిస్తున్నది. రాయిటర్స్ ఎక్స్ ఖాతా బ్లాక్ అవడంపై సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతున్నది. అయితే రాయిటర్స్‌కు సంబంధించిన రాయిటర్స్ టెక్ న్యూస్, రాయిటర్స్ ఫ్యాక్ట్ చెక్, రాయిటర్స్ పిక్చర్స్, రాయిటర్స్ ఏషియా, రాయిటర్స్ చైనా వంటి ఎక్స్ ఖాతాలు భారత్‌లో కనిపిస్తుండటం గమనార్హం. థామ్సన్ రాయిటర్స్‌కు చెందిన న్యూస్, మీడియా విభాగం రాయిటర్స్. ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలో 2600 మంది జర్నలిస్టులు పనిచేస్తున్నారు.

సిబ్బంది నియామకాల్లో ఒబిసి కోటా

- తొలిసారిగా రిజర్వేషన్లు
- వికలాంగులు, మాజీ సైనికోద్యోగులకు కూడా..
- సుప్రీంకోర్టు కీలక నిర్ణయం



న్యూఢిల్లీ : భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకున్నది. సుప్రీంకోర్టులోని సిబ్బంది నియామకాల్లో తొలిసారిగా ఇతర వెనుకబడిన తరగతి (ఒబిసి) కోటాను తీసుకొచ్చింది. దీంతో ఒబిసిలకు రిజర్వేషన్లు అమలుకానున్నాయి. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయం పట్ల పలు సిపిఎం తదితర రాజకీయపార్టీలు, ఒబిసిలకు సంబంధించిన సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. సిబ్బంది నియామకాలు, ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీలకు కోటాను అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇప్పటికే నిర్ణయించిన విషయం విదితమే. ఇప్పుడు వీరితో పాటు ఒబిసిలకు కూడా నియామకాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ రిజర్వేషన్ పాలసీని విస్తరించటం గమనార్హం.

కొత్త పాలసీ ప్రకారం వికలాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులకు కూడా రిజర్వేషన్లు వర్తించనున్నాయి. ఇందుకోసం ఈ నెల 4న ఒక నోటిఫికేషన్ విడుదలైంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 146, క్లాజ్ (2) కింద కల్పించిన అధికారాన్ని ఉపయోగించుకొని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ).. సుప్రీంకోర్టు ఆఫీసర్స్ అండ్ సర్వెంట్స్ (కండిషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ కండక్ట్) రూల్స్, 1961ను సవరించారు.

నియామకాలు, ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీలకు ఇప్పటికే రిజర్వేషన్‌ను నిర్ణయించారు. దీని ప్రకారం ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. మొత్తంగా ఎస్సీ, ఎస్టీ, ఒబిసి, వికలాంగులు, మాజీ సైనికోద్యోగులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు సుప్రీంకోర్టులోని సిబ్బంది నియామకాల్లో రిజర్వేషన్ ఫలాలను పొందనున్నారు. రిజిస్ట్రార్లు, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ లైబ్రేరియన్లు, జూనియర్ కోర్టు అసిస్టెంట్లు, ఛాంబర్ అటెండెంట్లు వంటి వివిధ పదవులకు రిజర్వేషన్ కోటా వర్తిస్తుంది. భారత ప్రభుత్వం కాలక్రమేణా జారీ చేసిన నియమాలు, ఆదేశాలు, నోటిఫికేషన్ల ప్రకారం రిజర్వేషన్లు అమలవుతాయి. అయితే, అవసరమైన విధంగా ఈ పాలసీకి సవరణలు, మార్పులు, మినహాయింపులు చేసే అధికారం సిజెఐకి ఉంటుంది.

సిపిఎం హర్షం

సిబ్బంది నియామక ప్రక్రియలో ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసి)కు కూడా రిజర్వేషన్లను అమలు చేయాలని సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) స్వాగతించింది. వికలాంగులు, మాజీ సైనికోద్యోగులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులకు కూడా రిజర్వేషన్లు వర్తింపజేయాలని సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయించింది. సుప్రీంకోర్టు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ సిపిఎం పొలిట్‌బ్యూరో ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. 'సుప్రీంకోర్టుకు చెందిన నాన్-జ్యుడీషియల్ సిబ్బందిలో ఎస్సీ, ఎస్టీ నియామకాలకు సంబంధించి రోస్టర్ పద్ధతిని ప్రధాన న్యాయమూర్తి అమలు చేయడం ఒక ముఖ్యమైన చర్య. నియామక నిబంధనలను సవరించేందుకు గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ చేపట్టిన చర్యను పార్టీ ప్రశంసిస్తోంది. ఇది నాన్-జ్యుడీషియల్ కోర్టు సిబ్బంది నియామకాల విషయంలో దీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న, ముఖ్యమైన సంస్కరణ. ఇప్పటివరకూ సానుకూల పరిధిలో లేని రంగాలకు రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం చేకూర్చాలన్న దీర్ఘకాల డిమాండ్‌ను పాక్షికంగా నెరవేర్చడానికి తీసుకున్న ఈ నిర్ణయం ఆహ్వానించదగిన చర్యే' అని సిపిఎం పొలిట్‌బ్యూరో ఆ ప్రకటనలో పేర్కొంది.

బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా న్యాయ పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

వివరాలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగానూ, కరేడులో జరిగిన బహిరంగ సభనూ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. మీ పోరాటానికి అండగా ఉంటామన్నారు. కేరళ, కోనసీమలాంటి వాతావరణం ఇక్కడ ఉందని తెలిపారు. ఒకపక్క సముద్రం, మరోపక్క పచ్చని పంట పొలాలు ఉన్నాయని, ఆకుకూరలు, కూరగాయలు విస్తారంగా ఇక్కడ పండుతున్నాయని, ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో కరేడు ప్రాంతం ఉందని వివరించారు. ఇలాంటి పచ్చని పంట భూములను ఇండోసోల్ కంపెనీకి కట్టబెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. మూడు పంటలు పండే భూములు, మామిడి తోటలు తీసుకోవడంలో ఆంతర్యం ఏమిటో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ భూములు పరిశ్రమల కోసం కాదని, భూగర్భంలో ఉన్నటువంటి ఖనిజ సంపదను వెలికి తీసి అదాని వంటి కార్పొరేట్లకు కట్టబెట్టి కోట్లు గడించడానికి పన్నాగం పన్నారని విమర్శించారు. వీరి పన్నాగాన్ని కరేడు ప్రజలు చీల్చి చెండాడి ఛేదించాలని కోరారు. గ్రామస్తుల పోరాటానికి ఐలు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో విశాలంగా బీడు భూములు ఉన్నాయని, అలాంటి వాటిని వదిలి పచ్చని పంట పొలాలను ఇండోసోల్ కోసం తీసుకోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గతంలో జగన్ ప్రభుత్వం ఇండోసోల్‌కు భూసేకరణ చేస్తుంటే, ఆ సంస్థ జగన్ బినామీ అన్న టిడిపి కూటమి నేతలు ఇప్పుడు అదే సంస్థను భుజాన వేసుకొని ఎందుకు మోస్తున్నారని ప్రశ్నించారు. ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ మాధవరావు మాట్లాడుతూ కరేడు ప్రజల పోరాటం చాలా న్యాయమైందన్నారు. జూన్ 29వ తేదీ జాతీయ రహదారి దిగ్బంధనం, జులై 4న ప్రజాభిప్రాయ సేకరణ సభలో భూసేకరణను గ్రామస్తులందరూ ముక్తకంఠతో వ్యతిరేకించిన తీరు స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. ఎపిసిఎల్‌సి నాయకులు క్రాంతి చైతన్య, చిలక చంద్రశేఖర్, బ్రహ్మం మాట్లాడుతూ కరేడు ప్రజల పోరాటానికి తాము అండగా ఉంటామన్నారు. సభలో సిపిఎం నాయకులు జి.వెంకటేశ్వర్లు, ఆప్ నాయకులు నేతి మహేశ్వరరావు, సిపిఐ నాయకులు బి.సురేష్, సామాజికవేత్త డాక్టర్ కె.వసుంధర, ప్రముఖ అడ్వకేట్ శ్రీదేవి తదితరులు మాట్లాడారు. ముందుగా గ్రామ నాయకులు లింగబతిని మధురెడ్డి, రమణ రెడ్డి, అజిత్ రెడ్డి, మాలకొండ రెడ్డి... గ్రామ నైసర్గిక స్వరూపాన్ని, భౌగోళిక స్థితిగతులను, మూడు పంటల పండుతుండడాన్ని నిజనిర్ధారణ బృందానికి వివరించారు. తాము ఎంతటి పోరాటాలకైనా, ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని, తమకు అండగా ఉండాలని కోరారు.

ఇక్కడి నుంచి ఎక్కడికీ వెళ్లేది లేదు
అందరిదీ ఒక్కటే మాట

నిజనిర్ధారణ బృందం కరేడు, రామకష్ణాపురం గ్రామస్తులతో సమావేశమైంది. ఈ సందర్భంగా రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గిరిజన మహిళలు పొన్నం రామలక్ష్మమ్మ, జగన్నాథం శేషమ్మ, కత్తి సుజాత మాట్లాడుతూ మా కాలనీ పోరాటాలతో ఏర్పడిందని, ఇక్కడి నుంచి ఎక్కడికీ వెళ్లేది లేదని తేల్చి చెప్పారు. అలగాయపాలెం, బట్టి సోమయ్యపాలెం, టెంకాయ చెట్లపాలెం, చిన్నపల్లెపాలెం, పెద్దపల్లి పాలెం తదితర చోట్ల మత్స్యకారులను, నర్సరీలలో పనిచేస్తున్న మహిళలను ఈ బృందం కలిసి వారితో అభిప్రాయాలను తెలుసుకున్నారు. నర్సరీ మహిళలు మాట్లాడుతూ కరేడు నర్సరీ నుంచే ప్రకాశం జిల్లాకు సరుగుడు, జామాయిల్ నారు సరఫరా అవుతున్నాయని, ఇక్కడ పండించిన కూరగాయలనే ఆ రెండు జిల్లాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు.

మత్స్యకారులు మాట్లాడుతూ చావనైనా చస్తాముగానీ ఈ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లబోమని, సముద్రానికీ, మాకూ ఎంతో అనుబంధం ఉందని, మమ్మల్ని గ్రామం నుండి పంపినా సముద్రాన్ని పంపలేరు కదా అని అన్నారు. సముద్రాన్ని, మత్స్య సంపదను వదిలి తాము బతకలేమని తెలిపారు. ఊరు ఖాళీ చేయబోమని, భూములు ఇచ్చేది లేదని చెప్పారు. సిపిఎం ఉలవపాడు మండల కార్యదర్శి జివి కుమార్ అధ్యక్షత వహించారను. ఐలు రాష్ట్ర నాయకులు నర్రా శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కటారి అజయ్ కుమార్, కందుకూరు నియోజకవర్గ నాయకులు జి వెంకటేశ్వర్లు, ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జివిబి కుమార్, నాయకులు పొట్లూరి రవి, గ్రామ నాయకులు అజిత్ రెడ్డి, మాలకొండ రెడ్డి, జయరామిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిమాచల్‌లో జల ఖడ్గం .. 78 మంది మృతి

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్‌లో వర్ష బీభత్సం కొనసాగుతోంది. దీంతో భారీ వర్షాలకు రాష్ట్రంలో గత రెండు వారాల్లో మరణించిన వారి సంఖ్య 78కు చేరింది. మరో 31 మంది ఆచూకీ తెలియకుండా గల్లంతయ్యారు. భారీ వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రహదారులపై కొండచరియలు విరిగిపడటం. మెరుపు వరదలు, కుంభవృష్టితో పరిస్థితి దారుణంగా ఉంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చాలా చోట్ల సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 240 రహదారులు ధ్వంసమైనట్లు మారినట్లు అధికారులు వెల్లడించారు. వీటిల్లో ఒక్క మండి జిల్లాలోనే 176 మార్గాలున్నాయి. అలాగే రాష్ట్రంలోని కంగ్రా, సిర్మూర్, మండి జిల్లాలకు ఆదివారం భారత వాతావరణ శాఖ (ఐఎండి) రెడ్ అలెర్టు జారీ చేసింది. భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అలాగే, రానున్న 24 గంటల్లో చంబా, కంగ్రా, మండి, శిమ్లా, సిర్మూర్ జిల్లాల్లో మెరుపు వరదలు రావొచ్చని హెచ్చరించింది. ఉనా, బిలాస్‌పుర్, హమిర్‌పుర్, చంబా, శిమ్లా, కుల్లు జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. రాష్ట్రంలో చాలా చోట్ల కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉందని, కాబట్టి బలహీనమైన నిర్మాణాల్లో ప్రజలను ఉండొద్దని అధికారులు హెచ్చరించారు. ఈ నెల 8 వరకూ హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి అంచనా వేస్తోంది.



జీవన సారథ్యం

విలువ కోసం విలువలేని చోట ప్రయత్నించడం ఉన్న విలువను వదులుకోవడమే అవుతుంది.

మీ కోసం

వంకాయ కూర వండేటప్పుడు రెండు చుక్కల నిమ్మరసం పిండితే కూర రంగు మారదు, రుచిగా కూడా ఉంటుంది.



తెలుసుకుందాం - మేలుకుందాం



చదువుతోటే సంస్కారం
తొలగిపోవును అజ్ఞానం
పుస్తకాలతో సావాసం
పెంచును ఎంతో విజ్ఞానం

నీతి కథలతో కాలక్షేపం
తీర్చిదిద్దును జీవితం
పెద్దలతో గౌరవప్రదం
కీర్తికి ఎంతో గొప్పదనం

జంతువులతో స్నేహం
విశ్వాసానికి పీఠం
ఆటలతోనే ఆరోగ్యం
ఆయురావృద్ధికి సంకేతం

చక్కని స్నేహం ఆనందం
ప్రేరు ప్రఖ్యాతకు మూలం
చెడు వ్యసనాలు దూరం
చక్కని మార్గమే గౌరవం

కాలం వృథా కానీయం
విలువైన పనినే చేద్దాం
చాడీలు చెప్పుట మానేద్దాం
సావాసం చక్కగా చేద్దాం

అమ్మనాన్నను పూజిద్దాం
మా దైవం వారని
తలుద్దాం
తోటివారితో బాగుందాం
తోడ్పాటును అందిద్దాం

కల్మషాన్ని తొలగిద్దాం
కరుణతో మసలుదాం
అబద్దాలను ఆపేద్దాం
నిజం నిలకడగా
నిలిపేద్దాం

చక్కగా అన్నీ ఆచరిద్దాం
పదుగురితో పంచుదాం
సమాజాన్ని మారుద్దాం
మంచి పేరును గడిద్దాం

- నరెద్దుల రాజారెడ్డి,
96660 16636.

సమానార్థాలు రాయండి

పిల్లలూ ఇక్కడ కొన్ని తెలుగు పదాలు ఇచ్చాం. వాటి సమానార్థాలు మీరు రాయాలి. ఇచ్చిన క్లూ ఆధారంగా ఒకే ఒక్క అక్షరం రాస్తే సరిపోతుంది.

ట్రై చేయండి చూద్దాం.

నుయ్యి, వర్షం, అడవి, ప్రథమం, ఆకాశం, బంగారం

వా-
నిం-
బా-
తొ-
కన-
కా-



నేను గీసిన బొమ్మ



దాసరి తేజ,
5వ తరగతి,
అభ్యాస విద్యాలయం,
గుణదల,
విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడి: chinnaarips@gmail.com

విషజ్వరాలపై అప్రమత్తత ముఖ్యం

రాష్ట్రంలో గత కొన్నిరోజులుగా జ్వరాలు వణికిస్తున్నాయి. పిల్లల దగ్గరి నుంచి పెద్దల వరకూ అందరినీ ఇవి కలవర పెడుతున్నాయి. అసలే వానాకాలం. పైగా విచిత్రమైన పరిస్థితి. కురిస్తే భారీ వర్షం. కాస్తే మహా ఎండ. తేమ, వేడితో కూడిన ఇలాంటి వాతావరణం. వైరస్‌లు వృద్ధి చెందుతున్నాయి. మరోవైపు ఇబ్బడి ముబ్బడిగా దోమలు విజృంభిస్తున్నాయి. వీటి మూలంగా జలుబు, ఫ్లూ, డెంగీ, మలేరియా వంటి జ్వరాలు విజృంభిస్తున్నాయి. నిజానికివన్నీ మామూలుగా తగ్గేవే. కానీ పరిస్థితి విషమిస్తే కొన్నిసార్లు ప్రాణాంతకంగానూ పరిణమించొచ్చు. కాలంలో కొన్ని జాగ్రత్తలు పాటించటం ద్వారా జ్వరాలు సోకకుండా, ఒకవేళ వచ్చినా వాటి నుంచి సులభంగా బయటపడొచ్చు.



ప్రజలను విష (వైరల్) జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. దగ్గు, జలుబుతో బాధితుల గొంతు కూడా మారుతోంది. ఎన్నడూ లేనివిధంగా కీళ్ల నొప్పులు వేధిస్తున్నాయి. సాధారణంగా జూన్ నుంచి అక్టోబరు తొలివారం వరకూ జ్వరాల ఉధృతి ఉంటుంది. ప్రస్తుతం వాతావరణంలో భిన్న పరిస్థితులు నెలకొనటం కూడా వైరస్‌ల వృద్ధికి కారణమవుతోంది. గత కొన్ని రోజులుగా తరచూ వర్షాలు కురవడం వల్ల దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. వాటి వల్ల బాధితులు పెరుగుతున్నారే తప్ప తగ్గడం లేదు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకూ పరిస్థితి ఇలాగే ఉంటుంది.

విషజ్వరాలు : కొందరికి రెండు, మూడు రోజులకు జ్వరం తగ్గినట్లే తగ్గి మళ్లీ వస్తోంది. శరీర ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతోంది. రెండు, మూడు వారాలకు మించి కీళ్ల నొప్పులు ఇబ్బంది పెడుతున్నాయి. కొందరు నెల రోజులకు మించి బాధపడుతున్నారు. ఈ లక్షణాలు గన్యా కేసులను గుర్తుచేస్తున్నాయి. నొప్పుల వల్ల మహిళలు, వయసు పైబడిన వాళ్లు నిటారుగా నిల్చోలేకపోతున్నారు. ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారైతే అడుగు తీసి అడుగు వేసేందుకు అవస్థలు పడుతున్నారు. ఒకరికి ఫీవర్ వస్తే ఇంటిల్లిపాదికీ అంటుకుంటోంది. ఈ బాధ భరించలేక కరోనా సమయంలో ధరించినట్లు ఇంట్లోనూ మాస్కులు పెట్టుకుంటున్నారు. కొన్ని జాగ్రత్తలు కూడా పాటించేందుకు ప్రయత్నిస్తున్నారు.

గతంలో వైరల్ జ్వరం వస్తే మందులు వాడినా, వాడకున్నా 3, 4 రోజుల్లో తగ్గేది. ప్రస్తుతం 7 నుంచి 10 రోజులు వేధిస్తోంది. ఇన్‌ఫెక్షన్ తీవ్రతను చూపే సీఆర్పీ (సీ రియాక్టివ్ ప్రొటీన్) త్వరగా పెరిగిపోతోంది.

ఈ సమయంలో సీజనల్ ఫ్లూ సాధారణంగా వస్తుంది. ఇప్పుడు వచ్చే దగ్గు, జలుబు ఎక్కువ రోజులు వేధిస్తున్నాయి.

ఐదారు రోజుల్లో తగ్గాల్సిన జలుబు రెండు, మూడు వారాలు వెంటాడుతోంది.

ఎడతెరపి లేని దగ్గుతో ఎక్కువ మంది గొంతు నొప్పితో బాధపడుతున్నారు. పలువురికి ముక్కు, చెంపలు, కళ్ల కింద నల్లమచ్చలు కనిపిస్తున్నాయి.

సాధారణంగా వైరల్ జ్వరం నిర్ణీత కాలపరిమితిలో దానంతట అదే తగ్గుతుంది.

వైరస్ చక్రం ముగింపునకు సమీపిస్తున్న కొద్దీ లక్షణాలు తగ్గుతాయి. ఈ సారి కాస్త భిన్న పరిస్థితులు ఉన్నందున వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, తాజా ఆహారం తీసుకుంటూ.. రోగ నిరోధకశక్తిని పెంచే మందులు వాడాల్సి ఉంటుంది.

మలేరియా : ఈ జ్వరానికి మూలం 'ప్లాస్మోడియం' పరాన్నజీవి. దీనిలో ఫాల్సిఫారమ్, వైవాక్స్, ఒవేల్, మలేరియే అని నాలుగు రకాలున్నాయి. ఇవి ఆడ ఎనాఫిలెస్ దోమల ద్వారా వ్యాపిస్తాయి. ప్రస్తుతం ఫాల్సిఫారమ్‌తో వచ్చే జ్వరాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. విపరీతమైన చలి, వణుకుతో తీవ్రమైన జ్వరం ముంచుకురావటం దీని ప్రధాన లక్షణం. కొందరికి తలనొప్పి, ఒళ్లునొప్పులు, వాంతులూ ఉండొచ్చు. చిన్నపిల్లల్లో కొందరికి నీళ్ల విరేచనాలు కావొచ్చు. మలేరియా ముదురుతున్నకొద్దీ రక్తహీనత, కామెర్ల వంటి సమస్యలూ వేధించొచ్చు. ఎర్ర రక్తకణాలు విచ్ఛిన్నం కావటం వల్ల హిమోగ్లోబిన్ కిడ్నీల ద్వారా బయటకు రావొచ్చు. దీంతో మూత్రం నల్లగా రావొచ్చు. మలేరియా నిర్ధారణ అయితే మందులను సరైన మోతాదులో వాడితే తగ్గిపోతుంది. లేకపోతే పరాన్నజీవులు మొండిగా తయారవుతాయి.

జలుబును అశ్రద్ధ చేయొద్దు : ఇది రైనోవైరస్ తరగతి వైరస్‌లతో వస్తుంది. ఇవి ఎప్పటికప్పుడు రూపం మార్చు కుంటుంటాయి. కొత్తవీ పుట్టుకొస్తుంటాయి. కాబట్టి రోగనిరోధక వ్యవస్థకివి ఎప్పుడూ కొత్తే. తరచూ జలుబు వస్తుండటానికి ఇదీ ఒక కారణమే. ఇందులో ముక్కు కారటం, ముక్కు బిగుసుకుపోవటం, గొంతునొప్పి, తుమ్ములు, దగ్గు, కళ్ల వెంట నీరు రావటం, ఒళ్లునొప్పులు, అలసట, బడలిక, కొద్దిగా జ్వరం వంటివి బాగా వేధిస్తాయి. జలుబు సాధారణంగా వారం వరకు ఉంటుంది. చాలావరకు దానంతటదే తగ్గిపోతుంది. తగినంత నీరు తాగటం, పోషకాహారం తినటం మంచిది. లక్షణాలు మరీ ఎక్కువగా వేధిస్తుంటే యాంటీహిస్టమిన్, దగ్గు మందులు వాడుకోవచ్చు. జ్వరం తగ్గటానికి పారాసిటమాల్ మాత్రలు వేసుకోవచ్చు.

ఇన్ఫెక్షన్లు : కొందరికి ఫ్లూ జ్వరాలు తీవ్రంగా వస్తుంటాయి. దీనికి మూలం ఫ్లూ వైరస్‌లు. ఇవి ముక్కు, గొంతు, ఊపిరితిత్తుల మీద దాడి చేసి ఇన్‌ఫెక్షన్‌కు దారితీస్తాయి. ఇది చాలావరకు దానంతటదే తగ్గుతుంది. కానీ పిల్లలకు, వృద్ధులకు, గర్భిణులకు, రోగనిరోధకశక్తి తక్కువగా ఉండేవారికి.. ఆస్తమా, గుండె, కిడ్నీ, కాలేయ జబ్బులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక జబ్బులు గలవారికి తీవ్రంగా పరిణమిస్తుంది. ఇందులో జ్వరం 101 డిగ్రీల కన్నా ఎక్కువగా ఉంటుంది.

భయపెడుతున్న ఒంటినొప్పులు : ఈ కాలంలో ఒళ్లునొప్పులూ ఎక్కువే. వీటిని బట్టే ఫ్లూనా? జలుబా? అనేది గుర్తించొచ్చు. తలనొప్పి, గొంతునొప్పి కూడా ఉండొచ్చు. పొడి దగ్గు, శ్వాస సరిగా తీసుకోలేకపోవటం, అలసట, నీరసం, ముక్కు కారటం, ముక్కు దిబ్బడ, కంటి నొప్పి వంటివి వేధిస్తాయి. జ్వరం, ఒళ్లు నొప్పుల వంటివి మూడు, నాలుగు రోజుల్లో వాటంతటవే తగ్గుతాయి. అందువల్ల మొదట్లో పెద్దగా చికిత్సల అవసరమేమీ ఉండదు. ద్రవాలు ఎక్కువగా తాగటం, విశ్రాంతి తీసుకోవటం మంచిది. అవసరమైతే జ్వరం తగ్గటానికి పారాసిటమాల్ వేసుకోవచ్చు. మూడు రోజులైనా ఇబ్బందులు విడవకుండా వేధిస్తుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

యాంటీఫ్లూ మందులతో చాలావరకు నయమవుతుంది. కొందరిలో పై శ్వాసకోశకు పరిమితమైన సమస్య కిందికీ విస్తరించి వైరల్ న్యుమోనియాగా మారొచ్చు. శ్వాస తీసుకోవటం కష్టమవుతున్నా, దగ్గు, ఆయాసం వేధిస్తున్నా, జ్వరం తగ్గకుండా కొనసాగుతూ వస్తున్నా, కళ్లెతో పాటు రక్తం పడుతున్నా నిర్లక్ష్యం చేయొద్దు. వెంటనే డాక్టరును సంప్రదించడం ఉత్తమం.



- డాక్టర్ భట్టిప్రోలు రామారావు,
విశ్రాంత వైద్యాధికారి, విజయవాడ
నగర పాలక సంస్థ, విజయవాడ.
సెల్ : 9703013238

కమర్షియల్ హంగులతో 'కన్నప్ప'



మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కిన చిత్రమే 'కన్నప్ప. ఈ చిత్రంలో ఆయన ప్రధాన పాత్ర పోషించడంతో పాటు కథకుడిగా, నిర్మాతగాను వ్యవహరించారు. మంచు ఫ్యామిలికి చెందిన మూడు తరాలు ఈ చిత్రంలో నటించాయి. ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్ లాంటి అగ్ర నటులు కీలక పాత్రలు పోషించారు. నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి టీజర్, ట్రైలర్ వచ్చాక ఈ సినిమాపై ఉన్న నెగెటివిటీ తగ్గిపోయింది. ప్రమోషన్స్ గట్టిగా చేయడంతో హైప్ క్రియేటయ్యింది. భారీ అంచనాల మధ్య జూన్ 27న పాన్ ఇండియాస్థాయిలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిశ్రమ స్పందనను అందుకుంది. కన్నప్ప కథ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. నాస్తికుడైన తిన్నడు భక్తుడిగా ఎలా మారాడనేది 50 ఏళ్ల క్రితమే కృష్ణంరాజు 'భక్త కన్నప్ప' చిత్రం ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు. అదే కథతో ఇప్పుడు మంచు విష్ణు 'కన్నప్ప' చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఓ భక్తి కథకు కావాల్సినంత కమర్షియల్ ఎలిమెంట్స్‌ను తోడు చేసి నేటి తరానికి నచ్చేలా 'కన్నప్ప' కథను చెప్పాలనుకున్నారు మంచు విష్ణు. ఎమోషన్‌ని తెరపై పండించే ప్రయత్నం జరిగింది. భావోద్వేగ సన్నివేశాలను దర్శకుడు బాగా పండించారు. చివరి 40 నిమిషాలు సినిమా చాలా ఎమోషనల్‌గా సాగుతుంది. శివుడు గురించి పాట రూపంలో చెబుతూ కథను ప్రారంభించాడు దర్శకుడు. ఆ తర్వాత తిన్నడు ఎందుకు నాస్తికుడిగా మారాల్సి వచ్చిందో అర్థవంతంగా చూపించారు. మంచు విష్ణు ఎంట్రీ కథనం ఆసక్తి పెరుగుతుంది. యువరాణి నెమలితో ప్రేమలో పడడం.. వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు యూత్‌ని ఆకట్టుకునే ఉన్నాయి. పాటల పేరుతో అశ్లీలత కొన్ని చోట్ల శృతిమించిందనే చెప్పాలి. మోహన్ బాబు, మోహన్‌లాల్ ఎంట్రీ సీన్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. అయితే ఫస్టాఫ్‌లో వచ్చే యుద్ధ సన్నివేశాలు మాత్రం అంతగా ఆకట్టుకోలేదనే చెప్పాలి. ఓవరాల్‌గా ఫస్టాఫ్ పర్లేదులే అన్నట్లుగా సాగుతుంది.

ఇక సెకండాఫ్‌లో కథనం పరుగులు పెడుతుంది. ముఖ్యంగా రుద్రగా ప్రభాస్ ఎంట్రీ ఇచ్చిన తర్వాత కథనం మరింత ఆసక్తికరంగా సాగుతుంది. ప్రభాస్ కనిపించేది 20 నిమిషాలే అయినా.. ప్రేక్షకులు అలా చూస్తూ ఉండిపోతారు. క్లైమాక్స్‌లో విష్ణు నటన ఆకట్టుకుంటుంది. శివుడికి తనకంటే గొప్ప భక్తుడు లేడని భావించే మహాదేవ శాస్త్రీగా మోహన్‌బాబు తనదైన నటన, డైలాగులతో ఆకట్టుకున్నారు. మోహన్‌లాల్ తెరపై కనిపించేది కాసేపే అయినా.. ఆ సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. శివుడి పాత్రలో అక్షయ్‌కుమార్ పార్వతీదేవి పాత్రలో కాజల్ ఒదిగిపోయారు. ఇక తిన్నడు తండ్రిగా శరత్‌కుమార్ నటన బాగుంది. చిన్నప్పటి తిన్నడుగా నటించిన అవ్రామ్ నటన పరంగా బాగానే ఉంది. బ్రహ్మానందం, మధుబాల, శివబాలాజీతో పాటు మిగిలిన నటీనటులు తమ పాత్రల పరిధిమేర నటించారు. సాంకేంతికంగా సినిమా బాగుంది. స్టీఫెన్ దేవస్సీ పాటలు పర్వాలేదు కానీ నేపథ్య సంగీతమే అంతగా బాగోలేదనే విమర్శలు ఉన్నాయి. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలను గుర్తు చేసేలా బీజీఎం ఉంది. షెల్డన్ చౌ సినిమాటోగ్రఫీ అద్భుతంగా ఉంది. న్యూజిలాండ్ అందాలను తెరపై చక్కగా చూపించాడు. ఆర్ట్ డిపార్ట్‌మెంట్ పనితీరు బాగుంది. ఎడిటింగ్ ఓకే. నిర్మాణ విలువలు సినిమా స్థాయికి తగ్గట్లు ఉన్నతంగా ఉన్నాయి.

నెగెటివిటీ నుంచి పాజిటివిటీకి...

కావాలని సినిమాని టార్గెట్ చేసి, నెగిటివ్‌గా చెప్తే కఠిన చర్యలు తీసు కుంటామని నిర్మాణ సంస్థ విడుదలకు ముందే క్రిటిక్స్, యూట్యూబర్స్‌కు హెచ్చరికలు జారీచేసింది. ఓ నోట్ కూడా విడుదల చేయటంతో అది సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. టీజర్ రిలీజైనప్పుడు విజువల్స్, మంచు విష్ణు యాక్టింగ్‌పై ట్రోల్స్ గట్టిగానే వచ్చాయి. ఆ నోట్‌తో వారంతా ఆనక సైలెంట్ అయిపోయారు.

బలిని వ్యతిరేకించిన తిన్నడు

ఇక కథలోకి వెళ్తే తన చిన్ననాట జరిగిన ఓ సంఘటనతో నాస్తికుడిగా తిన్నడు మారిపోతాడు. దేవుడు లేడని నమ్ముతుంటాడు. విలువిద్యలో తిరుగులేని అతడు తానుండే గూడెంతోపాటు, చుట్టుపక్కల గూడేలకు ఏ ఆపద వచ్చినా ముందుంటాడు. ఆ గూడేల్లో అనాదిగా ఆపద వచ్చిన ప్రతిసారీ అందరూ క్షేమంగా ఉండాలని అక్కడ వెలసిన అమ్మవారికి ఒకరిని బలిస్తుంటారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకించి గూడెం నుంచి బహిష్కరణకి గురవుతాడు తిన్నడు. మనసిచ్చిన నెమలి (ప్రీతి ముకుందన్) అతని వెంట నడుస్తుంది. అలా నాస్తికుడిగా వెళ్లిన తిన్నడు, శివ భక్తుడిగా ఎలా మారిపోయాడు? తిన్నడు అలా మారిపోవడానికి కారకుడైన రుద్ర ఎవరు? తిన్నడు భక్తుడిగా మారిపోయాక తన శివయ్య కోసం ఏం త్యాగం చేశాడు? అతనికి భక్త కన్నప్పగా పేరు రావడం వెనక కథేమిటి? పార్వతీదేవి శ్రీకాళహస్తిలో జ్ఞాన ప్రసూనాంబికగా ఎలా వెలసింది? ఎవరి చూపు పడనీయకుండా వాయులింగాన్ని కాపాడుకుంటూ వస్తున్న మహాదేవశాస్త్రి (మోహన్‌బాబు) ఎవరు? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.

భక్త కన్నప్ప (1976)కు ప్రతిరూపమే..

'శ్రీకాళహస్తీశ్వర మహత్యం' వివరిస్తూ కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ హీరోగా 1954లో ఈ కథాంశం సినిమాగా వచ్చింది. అయితే బాపు రమణ దీనిని ఇంకాస్త అందంగా తీర్చిదిద్ది భారీ హంగులతో తీసి ప్రేక్షకులను అలరించారు. కోయవాడైన తిన్నడు శివుడిపై భక్తితో తన రెండు కన్నులు అర్పించపూనుకుని 'కన్న'ప్పగా మారడం కథ. ఈ గిరిజన కథ సినిమాగా విస్తరించడంలో భాగంగా ఊరు, విలన్‌గా రావు గోపాలరావు రంగప్రవేశం చేస్తారు. కమెడియన్ సారథి ఇందులో ముఖ్యమైన వేషం. వాణిశ్రీ హీరోయిన్‌గా సినిమాకు గ్లామర్ తెచ్చారు. సత్యం సంగీతంలో వచ్చిన పాటలు 'ఎన్నియల్లో ఎన్నియల్లో చందమామ', 'ఆకాశం దించాలా', 'శివ శివ శంకర భక్తవ శంకర' పెద్ద హిట్. కృష్ణంరాజు స్వయంగా నిర్మించిన ఈ సినిమా ఆయనకు భారీగా లాభాలు తెచ్చి పెట్టింది. 'కంద గెలిచింది' పాట 'డ్రమ్స్ పాట'గా చాలా భారీస్థాయిలో తీశారు.




ఎడ్జ్‌బాస్టన్ కోట బద్దలుకొట్టారు

- 337 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై భారత్ గెలుపు
- పేసర్ ఆకాశ్ దీప్ ఆరు వికెట్ల విజృంభణ
- ప్లేయర్ ఆఫ్ మ్యాచ్ శుభ్‌మన్ గిల్
- 1-1తో టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీ సమం



బర్మింగ్‌హామ్ : ప్రస్తుత ఇంగ్లండ్ పర్యటనలో తొలి టెస్టులో ఊహించని రీతిలో పరాజయం చెందిన భారత్ రెండో టెస్టులో దుమ్మురేపింది. అది సామాన్యంగా కాదు. ఇదీ కూడా గత 58 ఏళ్లలో 8 టెస్టులు ఆడి ఒక్క మ్యాచ్‌లో కూడా విజయం సాధించని ఎడ్జ్‌బాస్టన్‌లో చరిత్ర తిరగరాసింది. ఆస్ట్రేలియా కంచుకోట గబ్బాను 2021లో బద్దలుకొట్టిన భారత్.. తాజాగా ఇంగ్లాండ్ కంచుకోట ఎడ్జ్‌బాస్టన్‌ను సైతం బద్దలుకొట్టింది. బ్యాటర్లు, బౌలర్లు అద్భుత ప్రదర్శనతో చెలరేగగా ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో భారత్ 337 పరుగుల తేడాతో చారిత్రక విజయం సాధించింది. ఎడ్జ్‌బాస్టన్‌లో జయకేతనం ఎగరువేసింది. 608 పరుగుల రికార్డు ఛేదనలో ఇంగ్లాండ్ తన రెండో ఇన్నింగ్స్‌లో 68.1 ఓవర్లలో 271 పరుగులకు కుప్పకూలింది. దీంతో బర్మింగ్‌హామ్‌లో భారత్ భలే విజయం అందుకుంది. రెండో టెస్టులో గెలుపుతో 'టెండూల్కర్-అండర్సన్' ట్రోఫీని భారత్‌ను 1-1తో సమం చేసింది. పేసర్లు మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్‌లు వికెట్ల వేటను శాసించగా.. స్పిన్ ద్వయం జడేజా, సుందర్‌లు కీలక సమయంలో మాయ చేశారు. ముఖ్యంగా రెండో ఇన్నింగ్స్‌లో యువ పేసర్ ఆకాశ్ దీప్ (6/99) ఆరు వికెట్లతో విజృంభించాడు. ఇంగ్లండ్ జట్టులో జెమీ స్మిత్ (88, 99 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో భారత్ విజయాన్ని ఆలస్యం చేశాడు. ఒలీ పోప్ (24), జో రూట్ (6), హ్యారీ బ్రూక్ (23), జెమీ స్మిత్ వికెట్లతో టీమ్ ఇండియా విజయానికి ఆకాశ్ దీప్ మార్గం సుగమం చేశాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 587 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌ను 427/6తో డిక్లరేషన్ ఇచ్చింది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 407 పరుగులే చేసిన సంగతి తెలిసిందే. టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఓ మ్యాచ్‌లో 250 ప్లస్, 150 ప్లస్ పరుగులు నమోదు చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పిన శుభ్‌మన్ గిల్ ఎడ్జ్‌బాస్టన్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కు ఇది తొలి విజయం కావటం విశేషం. ఐదు టెస్టుల అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో మూడో టెస్టు జులై 10 నుంచి లార్డ్స్‌లో జరుగనుంది.



ఆకాశ్ అదరగొట్టగాడు : ఓవర్‌నైట్ స్కోరు 72/3తో ఐదో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన ఇంగ్లాండ్‌ను భారత పేసర్ ఆకాశ్ దీప్ వణికించాడు. కొత్త బంతితో వికెట్ టు వికెట్ బంతులేసిన ఆకాశ్ దీప్.. ఇంగ్లాండ్ బ్యాటర్లను విలవిల్లాడించాడు. ఫామ్‌లో ఉన్న బ్యాటర్లు ఒలీ పోప్ (24), హ్యారీ బ్రూక్ (23)లను వరుస ఓవర్లలో అవుట్ చేశాడు. 83/5తో ఇంగ్లాండ్ మరోసారి తొలి ఇన్నింగ్స్ తరహా కష్టాల్లో కూరుకుంది. కానీ, ఈసారి ఆ జట్టును ఆదుకునేందుకు ఎవరూ నిలబడలేదు. ఆకాశ్ దీప్‌కు సిరాజ్, జడేజా, ప్రసిద్, సుందర్‌లు సైతం జతకలిశారు. దీంతో ఇంగ్లాండ్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. లంచ్ విరామానికి ముందు ఆఖరు ఓవర్లో బెన్ స్టోక్స్ (33)ను సుందర్ మాయలో పడేయటంతో ఇంగ్లాండ్ ఓటమి లాంఛనమైంది. అప్పటికి ఆ జట్టు స్కోరు 40.3 ఓవర్లలో 153/6.

తొలి ఇన్నింగ్స్‌లో అజేయ సెంచరీ బాదిన జెమీ స్మిత్ (88) మరోసారి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. సహచర బ్యాటర్లు పెవిలియన్ బాట పట్టినా స్మిత్ ఎదురుదాడి కొనసాగించాడు. ఏడు ఫోర్లతో 73 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన స్మిత్‌ను అవుట్ చేసిన ఆకాశ్ దీప్ కెరీర్‌లో తొలి ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. క్రిస్ వోక్స్ (7), జోష్ టంగ్ (2) కథ ప్రసిద్, జడేజా ముగించగా.. బ్రైడన్ కార్స్ (38) వికెట్‌తో ఆకాశ్ దీప్ గెలుపు సంబరాలకు తెరతీశాడు. 68.1 ఓవర్లలో 271 పరుగులకే ఇంగ్లాండ్ ఆలౌట్ అయ్యింది. తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు పడగొట్టిన ఆకాశ్ దీప్.. రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లతో ఓవరాల్‌గా అరుదైన పది వికెట్ల ప్రదర్శన చేశాడు.

స్కోరు వివరాలు :

భారత్ తొలి ఇన్నింగ్స్ : 587/10
ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : 407/10
భారత్ రెండో ఇన్నింగ్స్ : 427/6 డిక్లేర్డ్

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ : బెన్ డకెట్ (బి) ఆకాశ్ 25, జాక్ క్రాలీ (సి) సుదర్శన్ (బి) సిరాజ్ 0, ఒలీ పోప్ (సి) ఆకాశ్ 24, జో రూట్ (బి) ఆకాశ్ 6, హ్యారీ బ్రూక్ (ఎల్బీ) ఆకాశ్ 23, బెన్ స్టోక్స్ (ఎల్బీ) సుందర్ 33, జెమీ స్మిత్ (సి) సుందర్ (బి) ఆకాశ్ 88, క్రిస్ వోక్స్ (సి) సిరాజ్ (బి) ప్రసిద్ 7, బ్రైడన్ కార్స్ (సి) గిల్ (బి) ఆకాశ్ 38, జోశ్ టంగ్ (సి) సిరాజ్ (బి) జడేజా 2, బషీర్ నాటౌట్ 12, ఎక్స్‌ట్రాలు : 13, మొత్తం : (68.1 ఓవర్లలో ఆలౌట) 271.

వికెట్ల పతనం : 1-11, 2-30, 3-50, 4-80, 5-83, 6-153, 7-199, 8-226, 9-246, 10-271.

బౌలింగ్ : ఆకాశ్ దీప్ 21.1-2-99-6, ప్రసిద్ కృష్ణ 12-3-57-1, ప్రసిద్ కృష్ణ 14-2-39-1, రవీంద్ర జడేజా 15-4-40-1, వాషింగ్టన్ సుందర్ 6-2-28-1.

రికార్డులు ఇవీ...

1692 : భారత్, ఇంగ్లాండ్ ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో నమోదైన పరుగులు 1692. ఈ రెండు జట్లు తలపడిన టెస్టులో పరుగుల పరంగా ఇదే అత్యధికం.

1 : ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌కు ఇదే తొలి విజయం. ఇక్కడ గతంలో 8 టెస్టులు ఆడినా.. ఒక్క విజయం దక్కలేదు

337 : రెండో టెస్టులో భారత్ 337 పరుగుల తేడాతో గెలుపొందింది. విదేశీ టెస్టులో పరుగుల పరంగా భారత్‌కు ఇదే అతిపెద్ద విజయం.

2 : ఇంగ్లాండ్ గడ్డపై ఓ టెస్టులో పది వికెట్లు పడగొట్టిన రెండో భారత బౌలర్ ఆకాశ్ దీప్ (10/187). 1986 బర్మింగ్‌హామ్ టెస్టులోనే చేతన్ శర్మ (10/188) పది వికెట్ల ప్రదర్శన చేశాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68